మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక
PRGI REGD NO: TGTEL/25/A1385
Circulated to Telangana
Published from Jagitial
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 18-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 350 Issue: 350

18 జూన్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:46 సూర్యాస్తమయం - సా. 6:48 తిథి చవితి రా. 7:05 వరకు తరువాత పంచమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం పుష్యమి ఉ. 11:33 వరకు తరువాత ఆశ్లేష యోగం వృఘుతా సా. 5:36 వరకు కరణం వనిజ ఉ. 8:16 వరకు విష్టి రా. 7:05 వరకు వర్జ్యం రా. 11:34 నుండి రా. 1:04 వరకు దుర్ముహూర్తం ఉ. 10:06 నుండి ఉ. 10:59 వరకు మ. 3:19 నుండి సా. 4:11 వరకు రాహుకాలం మ. 1:55 నుండి మ. 3:32 వరకు యమగండం తె. 5:46 నుండి ఉ. 7:23 వరకు గుళికాకాలం ఉ. 9:01 నుండి ఉ. 10:39 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:10 నుండి తె. 4:58 వరకు అమృత ఘడియలు తె. 5:40 నుండి ఉ. 7:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:51 నుండి మ. 12:43 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## మొన్న..

### చిప్స్ ప్యాకెట్‌లో బొమ్మ తిని బాలుడి మృతి

అనంతపురం, జూన్ 17 (ఈవార్తలు): చిప్స్ ప్యాకెట్‌లోని బొమ్మ ఓ పసివాడి ప్రాణం తీసింది. అనంతపురం జిల్లా గుత్తిలో మంగళవారం ఈ విషాదం చోటుచేసుకుంది. కోట వీధికి చెందిన అల్తాఫ్, సానియా దంపతుల ఒక్కగానొక్క కుమారుడు ఫర్హాన్(5). మారాం చేయడంతో సాయంత్రం పూట తల్లిదండ్రులు అతడికి చిప్స్ ప్యాకెట్ కొనిచ్చారు. వాటిని తినే క్రమంలో ఫర్హాన్ చూసుకోకుండా అందులో ఉన్న ప్లాస్టిక్ బొమ్మను మింగేశాడు. అది గొంతులో ఇరుక్కువడంతో ఊపిరాడక విలవిల్లాడాడు. తల్లిదండ్రులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే బాలుడు మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రుల రోదన ఆపడం ఎవరి తరం కాలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నిన్న..

### పానీపూరి తిని 20 మంది చిన్నారులకు అస్వస్థత

సిరిసిల్ల, జూన్ 17 (ఈవార్తలు): పానీపూరి తిని 20 మంది పిల్లలు అస్వస్థతకు గురైన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకుంది. తంగళ్లపల్లి మండలం కేసీఆర్ నగర్‌లో సోమవారం రోజు సాయంత్రం దాదాపు 20 మందికి పైగా చిన్నారులు.. స్థానికంగా ఉన్న పానీపూరి బండి వద్ద గప్ చుప్‌లు తిన్నారు. అయితే వారందరికీ మంగళవారం తెల్లవారుజామున నుంచి పలు అనారోగ్య లక్షణాలు కనిపించాయి. కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు కావడంతో, తల్లదండ్రులు వెంటనే పిల్లలను సిరిసిల్ల తరువాయి 2 వ పేజీలో...



# రాష్ట్రాల అప్పులు.. 90.51 లక్షల కోట్లు!


**అన్ని రాష్ట్రాల్లో ఆదాయం కంటే ఖర్చే ఎక్కువ**

**పదేళ్లలో 131 శాతం పెరిగిన బడ్జెట్ వ్యయం**

**పైసలన్నీ జీతాలు, పెన్షన్లు, వడ్డీలకే స్వాహా**

**అత్యధిక ఖర్చు నాగాలాండ్.. అత్యల్పం మహారాష్ట్ర**

దేశంలోని రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు పెరుగుతున్న అప్పులు, ఆర్థిక లోటు, నగదు కొరత వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన 'స్టేట్ ఫైనాన్సెస్ 2024-25' నివేదిక వెల్లడించింది. కాగ్ అధినేత కె. సంజయ్ మూర్తి విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, 2025 మార్చి చివరి నాటికి దేశంలోని 28 రాష్ట్రాల ఉమ్మడి అప్పుల భారం రూ.90.51 లక్షల కోట్లకు చేరింది.




న్యూఢిల్లీ: ఇదే సమయంలో అన్ని రాష్ట్రాలు ఆర్థిక లోటును నమోదు చేయగా, వాటిలో 15 రాష్ట్రాలు తమ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో 3 శాతం పరిమితిని మించి ఆర్థిక లోటును నమోదు చేయడం ఆందోళన కలిగించే అంశంగా పేర్కొంది. 2015-16లో రూ.22.18 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్రాల ఉమ్మడి వ్యయం, 2024-25 నాటికి రూ.51.20 లక్షల కోట్లకు పెరిగి పదేళ్లలో 131 శాతం వృద్ధి సాధించింది. ఈ ఖర్చులో దాదాపు 67 శాతం నిధులు సామాజిక, ఆర్థిక సంక్షేమ రంగాలకే వెచ్చించబడినట్లు నివేదిక తెలిపింది. సంక్షేమ పథకాలు, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, సామాజిక రక్షణ తరువాయి 2 వ పేజీలో...



## మోదీ కిల్లర్

**చూస్తే అందంగా ఉంటారు కానీ కఠినం**

**వ్యాపార లావాదేవీల్లో నిక్కచ్చిగా ఉంటారు**

**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్**

**జీ 7 శిఖరాగ్ర సదస్సుకు ఇరువురి హాజరు**

**త్వరలో భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం**

ప్యారిస్: జీ 7 దేశాల శిఖరాగ్ర సదస్సులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. మోదీని ఒక కిల్లర్, కఠినమైన వ్యాపారి అంటూ అభివర్ణించిన ట్రంప్, ఆయనపై తనకు అపారమైన గౌరవం ఉందని పేర్కొన్నారు. ట్రంప్ మాట్లాడుతూ... "ఆయనతో చర్చలు జరపడంలో చాలా కఠినమైన వ్యక్తి.. ఒక్కసారి ఈయన్ను చూడండి.. మీకు ఒక విషయం చెప్తాను. చూడటానికి -2 వ పేజీలో...



## తాగి తందనాలాడు!

**ఆంధ్రా బీచుల్లో బీచ్ షాక్స్**

**ఏపీ ప్రభుత్వం జీవో జారీ**

విజయవాడ, జూన్ 17 (ఈవార్తలు): ఏపీలో బీచ్ షాక్స్ ఏర్పాటు చేయాలని అక్కడి ప్రభుత్వం సంకల్పించింది. ఈ అంశంపై ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా రాష్ట్రంలో బీచ్ షాక్స్ ఏర్పాటుకు సంబంధించిన జీవోను ఏపీ ఎక్సైజ్ శాఖ విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం జీవో నంబర్ 362ను అధికారులు విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ 12 జిల్లాల్లో గుర్తించిన ప్రాంతాలలో బీచ్ షాక్స్ ఏర్పాటుకు గైడ్ లైన్స్ తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,137 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,248 |



## ఇన్‌స్టాలో మనమే ఫేమస్

**మోదీతో ఇటలీ ప్రధాని మెలోనీ**

పారిస్: ఫ్రాన్స్‌లో జీ-7 దేశాల సదస్సు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇవియన్ లెస్ బెయిన్ నగరంలో జరుగుతున్న ఆ మీటింగ్‌లో జీ7 దేశాల నేతలు గ్రూపు ఫోటో దిగారు. ఆ సమయంలో ప్రధాని మోదీ, ఇటలీ ప్రధాని జార్జ్ మెలోనీ ముచ్చటించుకున్నారు. ఆ కాస్త సమయంలో సోషల్ మీడియా గుర్తించి మాట్లాడుకున్నారు. మెలోనిని తరువాయి 2 వ పేజీలో...



## విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంపు

**1.621 శాతం డీఏ పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం**

**70,804 మంది ఉద్యోగులకు ప్రయోజనం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్, జూన్ 17 (ఈవార్తలు): విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంచుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యుత్ సౌధలోని జెన్ కో ప్రధాన కార్యాలయంలో బుధవారం ఇంధన శాఖ అధికారల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ నిర్ణయం తీసుకున్నారు. విద్యుత్ సంస్థల ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ఈ ఏడాది జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా డీఏను పెంచే ప్రతిపాదనకు డిప్యూటీ సీఎం పచ్చ జెండా ఊపారు. విద్యుత్ ఉద్యోగులకు 1.621 శాతం మేర డీఏను పెంచుతూ ప్రజాప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనితో విద్యుత్ ఉద్యోగుల తరువాయి 2 వ పేజీలో...



## 1.28 లక్షల పెన్షన్లు రద్దు

**తెలంగాణ సర్కారు సంచలన నిర్ణయం.. కొత్తగా 48 వేల మందికి పింఛన్లు**

పెన్షన్లు పొందుతున్న వారిలో అనర్హులను ఏరివేసేందుకు చేపట్టిన వెరిఫికేషన్ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం భాగంగా భారీగా అనర్హులను గుర్తించింది. ఈ క్రమంలోనే ఏకంగా 1.28 లక్షల మందికి పెన్షన్లు కట్ చేస్తూ.. సంచలన నిర్ణయం తీసుకుంది. ఇటీవల పెన్షన్ల వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టిన అధికారులు.. అనర్హులను ఏరివేశారు.

హైదరాబాద్, జూన 17 (ఈవార్తలు): ఈ పెన్షన్ రద్దైన వారిలో చనిపోయిన వారు, ప్రస్తుతం గ్రామాల్లో అందుబాటులో లేనివారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు.. ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రులు, 5 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్న వారు.. ఆదాయపు పన్ను చెల్లించే వారు ఉన్నారు. అయితే తొలగించిన 1.28 లక్షల పెన్షనల్లలో 1.02 లక్షల పెన్షన్లు గ్రామాల్లో నివసించే వారివే కావడం - 2 వ పేజీలో...

## విశ్వవాణి



అమెరికాలోని మియామి నగరానికి చెందిన లైల్ గిటెన్స్ (108), ఎలినోర్ గిటెన్స్ (107) దంపతులు ప్రపంచంలోనే అత్యంత వయోవృద్ధ వివాహిత జంటగా గుర్తింపు పొందారు. వీరిద్దరి కలిపి వయస్సు 216 సంవత్సరాలు కావడంతో, గిన్నిస్ రికార్డ్స్‌లో అధికారికంగా ఈ ఘనతను ప్రకటించింది. వీరిద్దరూ 1941లో క్లార్క్ అట్లాంటా యూనివర్సిటీలో చదువుతున్న సమయంలో తొలిసారి కలుసుకున్నారు. 1942లో, లైల్ రెండో ప్రపంచ యుద్ధానికి సైన్యంలో చేరే ముందు వివాహం చేసుకున్నారు. తమ 83 ఏళ్ల దాంపత్య జీవితంలో ముగ్గురు పిల్లలను పెంచి పెద్ద చేశారు. యుద్ధాలు, జీవితంలోని ఎన్నో సవాళ్లు, విజయాలను కలిసి ఎదుర్కొన్న ఈ జంటను దీర్ఘాయుష్షు, సంతోషకరమైన దాంపత్య రహస్యం ఏమిటని అడిగితే, ఎలినోర్ ఒకే మాటలో 'మేమిద్దరం ఒకరినొకరు ప్రేమిస్తాం' అని చెప్పారు.



## ఏఐ టూల్స్.. కాలేవు టీచర్లు

**మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు**

చెన్నై: విద్యారంగంలో ఏఐ అనేక మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే ఆన్‌లైన్ తరగతుల రూపంలో సంప్రదాయ విద్యకు ఎండ్ కార్డు పడుతున్న తరుణంలో ఏఐ విప్లవం సరికొత్త మార్పులకు కారణం అవుతోంది. ఈ నేపథ్యంలో చాట్ జీపీటీ వంటి ఏఐ టూల్స్, ఆన్ లైన్ క్లాసులపై మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సాంకేతికత ఎంత పెరిగినప్పటికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్, ఆన్‌లైన్ క్లాసులు అనేవి ఫిజికల్ క్లాస్‌రూమ్‌లకు, అర్హులైన లెక్చరర్లకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం



## నీట్ అభ్యర్థులకు ఫ్రీ బస్

హైదరాబాద్, జూన్ 17 (ఈవార్తలు): జూన్ 21న నిర్వహించనున్న నీట్-యూజీ 2026 రీ ఎగ్జామ్‌కు హాజరయ్యే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం కీలక సౌకర్యాన్ని ప్రకటించింది. పరీక్ష రాసే అభ్యర్థులు అదే రోజు తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేక మంది విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు,



## సైబర్ నేరగాళ్లు పరాన్న జీవులు

**సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యలు**

సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, సదరు పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం.

న్యూఢిల్లీ: ఈ పిటిషన్ విచారణ సందర్భంగా.. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో



# రాశి ఫలాలు

18.6.2026

మేషం: చేపట్టిన పనులు నత్తనడకన సాగుతాయి. వృథా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు తప్పవు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

వృషభం: వివాదాలకు సంబందించి విలువైన విషయాలు సేకరిస్తారు. రాజకీయ వర్గం వారితో పరిచయాలు పెరుగుతాయి. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగాలలో పురోగతి కలుగుతుంది.

మిధునం: ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్పదు. అనవసర వస్తువులపై ధన వ్యయం చేస్తారు. గృహమున కుటుంబ సభ్యుల ప్రవర్తన చికాకు కలిగిస్తుంది. వ్యాపార ప్రారంభమునకు అవాంతరాలు తప్పవు. అనుకోని ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: ప్రణాళికలు రూపొందించుకుని క్రమపద్ధతిలో పనులు పూర్తి చేస్తారు. ఆత్మీయుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం ఉన్నది.

సింహం: నూతన కార్యక్రమాలు ప్రారంభించి అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. నూతన గృహ వాహన యోగం ఉన్నది, వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు చేసి లాభాలు అందుకుంటారు. విద్యార్థుల యత్నాలు అనుకూలిస్తాయి. సంఘంలో విశిష్ఠ గౌరవ మర్యాదలు పొందుతారు. వ్యాపార, ఉద్యోగాలు ఆశాజనకంగా సాగుతాయి.

కన్య: కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలు మందగిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. అవసరానికి చేతిలో డబ్బు నిలువ ఉండదు. నూతన వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగులకు శ్రమాధిక్యత పెరుగుతుంది.

తుల: బంధువులతో స్వల్ప విభేదాలు కలుగుతాయి. ప్రయాణాలలో మరింత జాగ్రత్త వహించాలి. కుటుంబ సభ్యులతో దైవదర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగులకు స్థాన చలన సూచనలు ఉన్నవి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహ పరుస్తాయి.

వృశ్చికం: ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. ముఖ్య వ్యవహారాలలో కార్యసిద్ధి కలుగుతుంది. సమాజంలో మీ విలువ మరింత పెరుగుతుంది. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. వ్యాపారాలు విస్తరిస్తాయి. ఉద్యోగాలు ఆశాజనకంగా సాగుతాయి.

ధనస్సు: నిరుద్యోగులకు అరుదైన అవకాశములు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. పాతబాకీలు వసూలవుతాయి. ఇతరులకు సహాయ సహకారాలు అందిస్తారు. వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఉద్యోగాలలో వివాదాలు పరిష్కరించుకుంటారు. నూతన వాహన యోగమున్నది.

మకరం: చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఉంటాయి. బంధువులతో వివాదాలు సర్దుమణుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపించదు. దాయాదులతో ఆస్తి వివాదాలు కలుగుతాయి. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో చికాకులు తప్పవు.

కుంభం: మిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. స్థిరాస్తి వివాదాలకు సంబంధించి జాగ్రత్తగా వ్యవహరించాలి. కుటుంబ సభ్యులకు మీ ఆలోచనలు నచ్చవు. వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగాలలో ఇతరుల నుండి కొంత ఇబ్బందులు తప్పవు.

మీనం: చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహంతో పదోన్నతులు పెరుగుతాయి.

# రాష్ట్రాల అప్పులు.. 90.51 లక్షల కోట్లు!

**మొదటి పేజీ తరువాయి**


కార్యక్రమాలపై రాష్ట్రాలు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల వ్యయం పెరిగిందని పేర్కొంది. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే రంగాల్లో విద్యకు అత్యధిక కేటాయింపులు జరిగాయని, అనంతరం సామాజిక సంక్షేమం, విద్యుత్ (ఇంధన) రంగాలు నిలిచాయని కాగ్ వెల్లడించింది. అయితే ఈ వ్యయ పెరుగుదల దేశ ఆర్థిక వృద్ధికి అనుగుణంగానే కొనసాగిందని, రాష్ట్రాల మొత్తం బడ్జెట్ వ్యయం ఉమ్మడి జీఎస్‌డీపీలో 15.78 శాతం నుంచి 17.49 శాతం మధ్య స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది.

**జీతాలు, పెన్షన్లు, వడ్డీలకే భారీ ఖర్చు**

గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల మొత్తం బడ్జెట్ వ్యయం రూ.51.20 లక్షల కోట్లు కాగా, అందులో దాదాపు 80 శాతం రెవెన్యూ వ్యయానికే వినియోగించబడింది. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పెన్షన్లు, అప్పులపై వడ్డీ చెల్లింపులు వంటి తప్పనిసరి బాధ్యతలకే బడ్జెట్‌లో 43 శాతానికి పైగా ఖర్చవుతోంది. ఈ వ్యయం నాగాలాండ్‌లో 74 శాతం ఉండగా, మహారాష్ట్రలో 29 శాతంతో అత్యల్పంగా నమోదైంది. సబ్సిడీలు, ఉచిత పథకాలు, గ్రాంట్లు కలిపి మొత్తం ఖర్చులో 61 శాతం వరకు వినియోగించబడుతుండగా, కేవలం ఉచితాలు మరియు సబ్సిడీలకే సుమారు 10 శాతం బడ్జెట్ వెచ్చించబడుతోంది.

**13 రాష్ట్రాల్లో నగదు కొరత**

భారీ రెవెన్యూ వ్యయం కారణంగా 13 రాష్ట్రాలు తీవ్ర నగదు కొరతను ఎదుర్కొంటున్నాయని కాగ్ నివేదిక వెల్లడించింది. కొన్ని రాష్ట్రాల్లో ఖజానాలో నిల్వలు ఉన్నప్పటికీ, రోజువారీ చెల్లింపుల నిర్వహణ కోసం భారతీయ రిజర్వ్ బ్యాంకు నుంచి స్వల్పకాలిక అత్యవసర రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొంది. ఇది రాష్ట్రాల నగదు నిర్వహణపై అదనపు ఒత్తిడిని సూచిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, కేంద్ర సహాయంపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ రాష్ట్రాలు తమ సొంత ఆదాయ వనరులను బలోపేతం చేసుకోవడం సానుకూల పరిణామంగా నివేదిక పేర్కొంది. గతేడాది రాష్ట్రాలకు వచ్చిన మొత్తం రూ.40.52 లక్షల కోట్ల రెవెన్యూ ఆదాయంలో సగం వాటా సొంత పన్నుల ద్వారానే సమకూరింది. ఇందులో రాష్ట్ర జీఎస్టీ (ఎస్‌జీఎస్‌టీఈ) వాటా 43 శాతానికి పైగా ఉంది. జీఎస్టీ అమలు తర్వాత పన్ను వసూళ్లలో స్థిరమైన వృద్ధి నమోదైందని, గత పదేళ్లలో రాష్ట్రాల సొంత పన్నుల ఆదాయం రూ.8.40 లక్షల కోట్ల నుంచి రూ.20.31 లక్షల కోట్లకు పెరిగి రెట్టింపు కంటే అధిక వృద్ధిని నమోదు చేసిందని కాగ్



వెల్లడించింది.

**ఆర్థిక క్రమశిక్షణ అత్యవసరం**

రాష్ట్రాలు సంక్షేమ కార్యక్రమాలకు పెద్దఎత్తున నిధులు కేటాయించడం సామాజిక అభివృద్ధికి దోహదపడుతున్నప్పటికీ, పెరుగుతున్న అప్పులు, అధిక రెవెన్యూ వ్యయం, తప్పనిసరి చెల్లింపుల భారం దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వానికి సవాలుగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆదాయ వనరులను మరింత విస్తరించడం, మూలధన వ్యయానికి ప్రాధాన్యం ఇవ్వడం, అప్పుల నిర్వహణలో క్రమశిక్షణ పాటించడం రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్యానికి కీలకమని ఈ నివేదిక పరోక్షంగా హెచ్చరించింది.

# ఏఐ టూల్స్.. కాలేవు టీచర్లు

**మొదటి పేజీ తరువాయి**

కాలేవని వ్యాఖ్యానించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది మానవ మేధస్సుకు దగ్గరగా రావచ్చు కానీ అది విద్యార్థులకు నిజాయితీని, నైతికతను నేర్పించలేదని స్పష్టం చేసింది. క్లాసులకు హాజరు శాతం తక్కువగా ఉందనే కారణంతో పరీక్షలు రాసేందుకు అనుమతించని ముగ్గురు లా విద్యార్థుల పిటిషన్‌ను కొట్టివేస్తూ కోర్టు ఈ కీలక తీర్పును ఇచ్చింది. తమిళనాడు డాక్టర్ అంబేద్కర్ లా యూనివర్సిటీ దాఖలు చేసిన అప్పీలును విచారించిన జస్టిస్ ఎస్.ఎమ్. సుబ్రమణ్యం, జస్టిస్ ఎన్. సెంథిల్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు సింగిల్ జడ్జి ఇచ్చిన పాత ఉత్తర్వులను రద్దు చేసింది. హాజరు తక్కువగా ఉన్నందున సెమిస్టర్ పరీక్షలు రాయడానికి అనుమతించకపోవడంతో ముగ్గురు న్యాయ విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వీరి పిటిషన్లను పరిశీలించిన ఏకసభ్య ధర్మాసనం వారు తమ కోర్సును కొనసాగించడానికి, 8వ సెమిస్టర్‌కు హాజరు కావడానికి, పరీక్షలు రాయడానికి విద్యార్థులకు అనుమతి ఇచ్చింది. అయితే సింగిల్ బెంచ్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ విశ్వవిద్యాలయం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ పిటిషన్ పై విచారణ జరిపిన ధర్మాసనం.. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూల్స్ ప్రకారం లా విద్యార్థులకు 70 శాతం హాజరు తప్పనిసరి అని సరైన కారణాలు ఉంటే దాన్ని 65 శాతానికి మాత్రమే సడలించవచ్చు స్పష్టంగా ఉందని పేర్కొంది. హాజరు తక్కువ ఉన్న కొద్దిమంది విద్యార్థులకు మినహాయింపు ఇస్తే క్రమం తప్పకుండా క్లాసులకు హాజరవుతూ నిబంధనలు పాటించే మిగతా విద్యార్థులకు అన్యాయం చేసినట్లవుతుందని ధర్మాసనం పేర్కొంది. న్యాయవాద వృత్తికి నైతిక విలువలు ఎంతో ముఖ్యం. ఇలాంటి పాఠాలు కేవలం తరగతి గదుల్లో అందరి మధ్య కూర్చున్నప్పుడే నేర్చుకోగలరంటూ వ్యాఖ్యానించింది.

# పానీపూరి తిని 20 మంది చిన్నారులకు అస్వస్థత

**మొదటి పేజీ తరువాయి**

ఏరియా ఆస్పత్రితోపాటు పలు ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు. అస్వస్థతకు గురైన చిన్నారుల్లో రిషికేశ్ అనే బాలుడికి తీవ్ర జ్వరంతో ఫిట్స్ కూడా వచ్చినట్లు అతడి కుటుంబ సభ్యులు తెలిపారు. మరో 8 మంది చిన్నారుల పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. అయితే.. పానీపూరీ తినడం వల్లే వాళ్లందరూ అస్వస్థతకు గురయ్యారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పిల్లలందరికీ ఒకే రకమైన లక్షణాలు ఉండటంతో ఫుడ్ పాయిజన్ జరిగినట్లు డాక్టర్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పానీపూరీ బండి నుంచి సేకరించిన ఆహార పదార్థాలను ల్యాబ్‌కు టెస్టింగ్ కోసం పంపించారు. ఈ ఘటనపై సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# తాగి తందనాలాడు!

**మొదటి పేజీ తరువాయి**

రూపొందించారు. 2026 సెప్టెంబర్ 1 నుంచి 2029 ఆగస్ట్ నెల వరకూ బీచ్ షాక్స్ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. మరోవైపు పైలట్ ప్రాజెక్టు కింద విశాఖపట్నం, సూర్యలంక బీచ్‌లలో బీచ్ షాక్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ బీచ్‌లలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 వరకూ బీచ్ షాక్స్ నిర్వహించనున్నారు. ఇక్కడ విజయవంతమైతే రాష్ట్రంలోని అన్ని బీచ్‌లలో వీటిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. బీచ్ షాక్స్ అంటే సముద్ర తీరం వెంట ఏర్పాటు చేసే టెంపరరీ నిర్మాణాలు. పూర్తి పర్యావరణ అనుకూలంగా వీటిని ఏర్పాటు చేస్తారు. సాధారణంగా వీటిని వెదురు బొంగులు వంటి వాటితో ఏర్పాటు చేస్తారు. సముద్రపు అందాలను ఆస్వాదిస్తూ సేద తీరేందుకు బీచ్ బెడ్‌లుంటాయి. అలాగే బీచ్ బెడ్ల వద్ద నుంచే మనకు కావాల్సిన ఆహారాన్ని ఆర్డర్ చేసుకోవచ్చు. బీచ్ షాక్స్‌లలో బీర్లు, వైన్లు, జ్యూస్‌లు, సీఫుడ్, ప్రాంతీయ వంటకాలు, కాక్‌టెయిల్, డ్రింక్స్, స్నాక్స్ వంటివి అందుబాటులో ఉంచుతారు. అలాగే షవర్, వాష్ రూమ్స్ వంటి సౌకర్యాలు కూడా కల్పిస్తారు. అయితే బీచ్ షాక్స్‌లో విదేశీ మద్యం, ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ విక్రయాలకు ఏపీ ఎక్సైజ్ శాఖ అనుమతి ఇవ్వలేదు.

# 1.28 లక్షల పెన్షన్లు రద్దు

**మొదటి పేజీ తరువాయి**

గమనార్హం. మిగిలిన 26 వేల పెన్షన్లు మున్సిపాల్టీల పరిధిలో ఉన్నాయని అధికారులు వెల్లడించారు. మరోవైపు.. పాత పెన్షన్లను రద్దు చేయడమే కాకుండా.. కొత్త పెన్షన్లను మంజూరు చేసేందుకు కూడా అధికారులు కసరత్తులు చేపట్టారు. ఈ క్రమంలోనే కొత్తగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. మొత్తం 48 వేల మందిని ఎంపిక చేసి.. వారికి పెన్షన్లు అందించనున్నారు. ఇందులో వికలాంగులు, వితంతువులు ఉండగా.. వారి జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఆర్థిక శాఖ నుంచి అనుమతులు వచ్చిన వెంటే కొత్త లబ్ధిదారులకు పెన్షన్లను మంజూరు చేసేందుకు అధికారికంగా ఉత్తర్వులు వెలువరించనున్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ పెన్షన్ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. అదే సమయంలో అనర్హులకు వెంటనే పెన్షన్లు రద్దు చేయాలని భావించి.. సమగ్ర పెన్షన్ల వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టింది. ఈ వెరిఫికేషన్‌లో భారీగా అనర్హులు పెన్షన్లు పొందుతున్నట్లు గుర్తించి వాటిని కట్ చేశారు.

# మోదీ కిల్లర్

**మొదటి పేజీ తరువాయి**

ఎంతో అందంగా.. ప్రశాంతమైన వ్యక్తిలా కనిపిస్తారు. కానీ వాస్తవానికి, ఆయన ఒక 'కిల్లర్' అంత కఠినమైన వ్యక్తి. ఎవరైనా సరే సులువుగా బోల్తా పడతారు.. ఇలాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు" అని వ్యాఖ్యానించారు. "నేను అధ్యక్షుడిగా ఉన్నంత వరకూ భారతదేశానికి ఒక గొప్ప స్నేహితుడిగా ఉంటాను... ఇక్కడున్న ప్రతి ఒక్కరూ భారతదేశాన్ని ప్రేమిస్తారు, అలాగే ప్రధాని మోదీపై వారికి అపారమైన గౌరవం ఉంది" అని ట్రంప్ అన్నారు. "ఆయన ఎంతో మంచి వ్యక్తి అని ప్రజలు అంటుంటారు.. కానీ ఆయన చాలా కఠినమైన వ్యక్తి అని నేను చెబుతాను.. వ్యాపారాల విషయంలో ఆయన చాలా గట్టిగా వ్యవహరిస్తారు. ఆయన భారతదేశ ప్రజలను ఎంతగానో ప్రేమిస్తారు, అలాగే అమెరికాను కూడా ప్రేమిస్తారు. గతంలో హ్యూస్టన్‌లో 'హౌడీ మోదీ' కార్యక్రమం నిర్వహించాం. ఆ స్టేడియం మొత్తం నిండిపోయింది. భవిష్యత్తులో ఎప్పుడైనా భారత్‌ను సందర్శిస్తాను" అని ట్రంప్ అన్నారు. మోదీ తనకున్న స్నేహపూర్వక సంబంధాన్ని ప్రస్తావిస్తూ "ఏదైనా దేశం భారతదేశంపై దాడి చేస్తే, మా దేశం ఆదుకుంటుంది." అయితే, ప్రధాని మోదీ నాయకుడిగా ఉండాలి.. " అని ఆయన అన్నారు. పశ్చిమాసియాలో భారత్ పోషించే పాత్ర గురించి మీరు ఏదైనా ఆశిస్తున్నారా? అన్న ప్రశ్నకు "అవును, నేను ఆశిస్తున్నాను. ప్రతి విషయంలోనూ భారత్ పెద్ద పాత్ర పోషిస్తుందని నేను భావిస్తున్నాను. ఆయన (ప్రధాని నరేంద్ర మోదీ) నాయకుడిగా ఉన్నంత కాలం, భారత్ కీల పాత్ర పోషిస్తుంది" అని చెప్పారు. "భారత ప్రధానితో మేము చాలా మంచి చర్చలు జరిపాం... మేము వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాం... అమెరికా, భారత్ మధ్య ఎన్నో పరిణామాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం అమెరికా చరిత్రలోనే అత్యుత్తమ స్థితిలో ఉంది. మాకు 19.2 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయి, మేము పరిశ్రమలు, అన్నింటినీ నిర్మిస్తున్నాం.. భారత ప్రధాని కూడా అమెరికాలో పెద్ద ఎత్తున ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు. ఆయన అమెరికాలో చాలా డబ్బు ఖర్చు చేస్తున్నారు, ఆ ఉపాధి కల్పనను మేము అభినందిస్తున్నాం... ఆయన చాలా కాలంగా నాకు మంచి స్నేహితుడు, మా మధ్య ఎప్పుడూ గొప్ప సంబంధాలు ఉన్నాయి" అని ట్రంప్ అన్నారు.

# ఇన్‌స్టాలో మనమే ఫేమస్

**మొదటి పేజీ తరువాయి**

గ్రీట్ చేసిన తర్వాత మోదీ ఆమెకు షేక్‌హ్యాండ్ ఇచ్చారు. ఆ తర్వాత మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో మనం పాపులర్ అయ్యామన్న విషయాన్ని ఆమెతో మోదీ చెప్పారు. ప్రధాని మోదీ మాటలకు మెలోనీ రియాక్ట్ అవుతూ.. అవును, ఇన్‌స్టాగ్రామ్‌లో ఇప్పుడు మనం ఫేమస్ జంట అంటూ కామెంట్ చేశారు. ఆ ఘటనకు చెందిన వీడియో ఒకటి వైరల్ అవుతుంది. ఆ వీడియోలో నేతలు మాట్లాడుకుంటున్నారు, కానీ మాటలు మాత్రం స్పష్టంగా వినబడడం లేదు. వాస్తవానికి ప్రధాని మోదీ కొన్ని నెలల క్రితం ఇటలీలో పర్యటించారు. రోమ్‌లో ఉన్న చరిత్రక ప్రదేశాల్లో మెలోనీతో కలిసి టూర్ చేశారు. ఆ తర్వాత ప్రధాని మెలోనీకి మోదీ ఓ గిఫ్ట్ ఇచ్చారు. మెలోడీ చాక్లెట్ ప్యాక్‌ను ఆమెకు అందించారు. మోదీ ఇచ్చిన గిఫ్ట్‌ను తన సోషల్ మీడియాలో మెలోనీ షేర్ చేసి థ్యాంక్స్ చెప్పింది. ఇక ఆ భేటీ తర్వాత మెలోడీ అన్న పదం పాపులర్ అయ్యింది. మెలోనీ, మోదీ కలిస్తే మెలోడీ అవుతుందని జోకులు పేలాయి. ఆ ఇద్దరు నేతలపై ఆన్‌లైన్‌లో మీమ్స్ కూడా వైరల్ అయ్యాయి.

# సైబర్ నేరగాళ్లు పరాన్న జీవులు

**మొదటి పేజీ తరువాయి**

మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తావిస్తూ.. గతేడాది చివరి నాటికి దేశంలో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(చీజ=దీ) గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# నీట్ అభ్యర్థులకు ఫ్రీ బస్

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యంగా హైదరాబాద్‌కు చేరుకోవడానికి దూర ప్రయాణాలు చేయాల్సి వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జూన్ 16న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యాదవల్లి వెంకటస్వామి కలిసి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంపు

**మొదటి పేజీ తరువాయి**

డీఏ 17.651% నుంచి 19.272% కి చేరినట్లు అయింది. ఈ డీఏ పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు సుమారు రూ. 9.35 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. విద్యుత్ రంగ సంస్థల్లో పని చేస్తున్న మొత్తం 70,804 మంది సిబ్బంది, పెన్షనర్లు ఈ డీఏ పెంపు వల్ల ప్రయోజనం పొందనున్నారు. ఈ సమావేశంలోనే విద్యుత్ రంగ పనితీరును ఉప ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. ప్రధానంగా రాబోయో వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా విద్యుత్ అధికారులు సన్నద్ధం కావాలని చెప్పారు. అలాగే రానున్న పదేళ్లను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ రంగ సంస్థల్లో మౌలిక సదుపాయాల కోసం పటిష్టమైన ప్రణాళికను రూపొందించడంపై ఆయన అధికారులుకు పలు సూచనలు చేశారు. ఈ ఎండాకాలంలో రికార్డు స్థాయిలో గరిష్ట డిమాండ్ ఎదురైనా ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూసిన అధికారులను, సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ ఏడాది మార్చి 27న పీక్ డిమాండ్ 18,548 మెగావాట్లకు చేరిందన్నారు. అయినా సరఫరాలో అంతరయాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు, సిబ్బంది పని చేశారని ఆయన అన్నారు. అలాగే మార్చి 13, 2026 న అత్యధికంగా 341 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైనా నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, రాబోయే దశాబ్ద కాలానికి సమగ్రమైన, దీర్ఘకాలిక విద్యుత్ ప్రణాళికను సిద్ధం చేయాలని విద్యుత్ రంగ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరించాలని అన్నారు. రాష్ట్రంలో 2035-36 నాటికి పీక్ డిమాండ్ 34,137 మెగావాట్లకు చేరుకుంటుందని అంచనాగా చెప్పారు. ఈ ఏడాది నమోదైన పీక్ డిమాండ్ 18,548 మెగావాట్లకు దాదాపు రెట్టింపుగా ఉంటుందని అన్నారు. అంతేకాకుండా 2035-36 నాటికి వార్షిక విద్యుత్ అవసరాలు 1,52,626 మిలియన్ యూనిట్లకు (వీఖ) చేరుకుంటుందన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, ట్రాన్స్ కోలు అత్యంత సంసిద్ధంగా ఉండాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రధానంగా క్షేత్రస్థాయి అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే, తక్షణమే రంగంలోకి దిగి లోపాలను సరిచేయాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్ కో సీఎండీ హరీష్, ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్, ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ సంపత్ కుమార్, ట్రాన్స్ కో ప్రాజెక్ట్స్ డైరెక్టర్ శ్రీమతి లతా వినోద్ ఇతర విద్యుత్ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

# మట్టిలో మాణిక్యాలను తీస్తాం

**సర్కారు బడిలో విద్యార్థులకు అత్యుత్తమ వసతులు**

**తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్**





హైదరాబాద్, జూన్ 17 (ఈవార్తలు): తెలంగాణ భవిష్యత్ పునర్నిర్మాణం అద్దాల మేడల్లో కాదని.. తరగతి గదుల్లోనే ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై పెట్టేది ఖర్చు కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడని తెలిపారు. విద్య ఒక్కటే జీవితాలను సమూలంగా మార్చగలదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా భవిష్యత్తులో ప్రధాని, ముఖ్యమంత్రి, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, ప్రజాప్రతినిధులు కావచ్చని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడాన్ని ఎవరూ చిన్నతనంగా భావించవద్దని సూచించారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బుధవారం ప్రారంభించిన సీఎం అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పాఠశాల రాష్ట్రం మొత్తానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.27 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రపంచస్థాయి విద్యా సంస్థల వరకు పరిశీలించి విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి సమగ్ర నివేదిక అందించారని చెప్పారు. దాని ఆధారంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ల ఆలోచనకు రూపం ఇచ్చామని వివరించారు. నాణ్యమైన విద్య అందరికీ చేరాలన్న లక్ష్యంతో ఆరుట్ల గ్రామాన్ని ఎంచుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం భారీ స్పందన రావడం సంతోషకరమని సీఎం పేర్కొన్నారు. 'నో అడ్మిషన్స్' బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని అన్నారు. పాఠశాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. నిజాం పాలన, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి వంటి మహనీయుల స్ఫూర్తి ఉన్న నేలపై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వారి పోరాట స్ఫూర్తి ఇక్కడి విద్యార్థుల్లోనూ కనిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన సొంత నియోజకవర్గంలో ఈ పాఠశాలను ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ, ఆరుట్లను ఎంచుకోవడం వెనుక ఇదే కారణమని చెప్పారు. విద్యతో పాటు నైపుణ్యాలు కూడా అవసరమని సీఎం పేర్కొన్నారు. కేవలం చదువు మాత్రమే సరిపోదని, విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు పెరగాలని అన్నారు. అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. అక్కడ శిక్షణ పొందిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు. క్రీడల రంగంలోనూ తెలంగాణ మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆరుట్ల విద్యార్థులు ఫుట్‌బాల్ అద్భుతంగా ఆడారని ప్రశంసించారు. క్రీడల్లో వెనుకబాటుతనాన్ని అధిగమించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువచ్చి యువ క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపాలని ప్రయత్నించినట్లు తెలిపారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. సమాజంలో కులవివక్షను తగ్గించే దిశగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను తీసుకొస్తున్నామని సీఎం చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలని సంకల్పించామని పేర్కొన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ వసతులు, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. తరగతి గదులు, వసతి సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## పవన్.. సీబీఐ విచారణకు ఆదేశించు: అంబటి

తాడేపల్లి, జూన్ 17 (ఈవార్తలు): 23 ఏళ్ల యువకుడు గాదె సాయికృష్ణను లాకప్ డెత్ చేశారని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. "సాయికృష్ణను పోలీసులు హత్య చేసి శవాన్ని మాయం చేశారు. దేశంలో ఇంత ఘోరమైన లాకప్ డెత్ ఎక్కడా జరగలేదు" అని ఆరోపించారు. "సాయికృష్ణ మేనమామ నవరంగ్ నా దగ్గరకు వచ్చి జనసేన కార్యకర్తనని చెప్పారు. సాయికృష్ణ తల్లి వేదన ఎవరినైనా కలచివేస్తుంది. పార్టీలకు అతీతంగా ఈ అంశంపై ఉద్యమం చేయాలి" అని పిలుపునిచ్చారు. ఈ అంశంపై సీబీఐ ఎంక్వైరీ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. "పవన్ కల్యాణ్‌కు చేతులు జోడించి వేడుకుంటున్నాను. సీబీఐ విచారణకు ఆదేశించండి. మనం మానవులం కదా" అని అన్నారు. సాయికృష్ణ మేనమామ నవరంగ్ మీడియాతో మాట్లాడుతూ... "ఈ విషయాన్ని పార్టీలకు ముడిపెట్టడం సరికాదు. ఫ్రెండ్లీ పోలీస్ అంటే దాడి చేసి చంపి దహనం చేయడమా? ఆ తల్లి బాధ ఎవరికీ రాకూడదు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

## అనితకు మేకప్‌పైనే ప్రేమ: శ్యామల

తాడేపల్లి, జూన్ 17 (ఈవార్తలు): ఏపీ హోంమంత్రి అనితపై వైసీపీ అధికార ప్రతినిధి, బుల్లితెర యాంకర్ శ్యామల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన శ్యామల, "హోంమంత్రి అనితకు మేకప్ మీద ఉన్న ప్రేమ మనుషుల ప్రాణాల మీద లేదు" అని వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్వరి, సాయికృష్ణ కేసులపై హోంమంత్రి ఎందుకు మాట్లాడటం లేదని శ్యామల ప్రశ్నించారు. "సాయికృష్ణ మీద కేసులుంటే అతన్ని లాకప్ డెత్ చేస్తారా? ఇంకా ఎక్కువ కేసులున్న టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు ఎందుకు అదే ట్రీట్‌మెంట్ ఇవ్వడం లేదు?" అని నిలదీశారు. హోంమంత్రి అనిత మహిళల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని, అధికార మదంతో ఇష్టానుసారం మాట్లాడుతున్నారని శ్యామల ఆరోపించారు. వైసీపీ అధినేత జగన్, ఆయన కుటుంబ సభ్యులపై అనిత అత్యంత నీచంగా మాట్లాడారని విమర్శించారు. "మేము ఏదైనా మాట్లాడితే మహిళకు అవమానం అంటూ రచ్చ చేస్తారు. ఇవేనా మీ ఎల్లో మీడియా, ఐ-టీడీపీ చేసే నీచ రాజకీయాలు?" అని ప్రశ్నించారు. హోంమంత్రి బాధ్యత మహిళలకు రక్షణ కల్పించడమని, దాన్ని వదిలేసి నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాకినాడలో చిన్నారి మిస్సింగ్ కేసుపై కూడా హోంమంత్రి స్పందించడం లేదని దుయ్యబట్టారు.

## అరెస్టు చేస్తే అమర్నాథ్ పెద్ద నేత అవుతాడు

**పవన్ పాత వీడియోలతో పేర్ని నాని కౌంటర్**

విజయవాడ, జూన్ 17 (ఈవార్తలు): మంత్రి వంగలపూడి అనిత, వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ మధ్య నడుస్తున్న పొలిటికల్ వార్‌లో... ఇప్పుడు మాజీ మంత్రి పేర్ని నాని ఎంట్రీ ఇచ్చారు. ఈ ఇష్యూపై ప్రెస్‌మీట్ పెట్టిన ఆయన, కూటమి నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గతంలో పవన్ కల్యాణ్, ఇతర టీడీపీ నేతలు మాట్లాడిన పాత వీడియోలను స్క్రీన్‌పై ప్రదర్శిస్తూ రివర్స్ అటాక్ చేశారు. గతంలో పవన్ కల్యాణ్... "ఆడ కాదు మగ కాదు.. ఒక్కొక్కరిని తొక్కిపట్టి నారతీస్తా.. కొడకల్లారా" అంటూ మాట్లాడిన వీడియోలను పేర్ని నాని ప్రదర్శించారు. "మేమంతా పవన్ కల్యాణ్ కొడుకులమా? మరి ఆయన మాట్లాడింది సంస్కారవంతమైన భాషేనా?" అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి పదవి వచ్చాకే పవన్‌కు సంస్కారం గుర్తొచ్చిందా అని నిలదీశారు. అమర్‌నాథ్‌పై 10 నుండి 15 కేసులు పెట్టేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని, కానీ అరెస్ట్‌లకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. అరెస్ట్ చేస్తే అమర్‌నాథ్ ఇంకా పెద్ద లీడర్ అవుతాడే తప్ప వచ్చే నష్టమేమీ లేదన్నారు. అసలు హోంమంత్రి కట్టుబొట్టు గురించి అమర్‌నాథ్ ఎక్కడ మాట్లాడారని పేర్ని నాని ప్రశ్నించారు. ఆంధ్రాలో ఒక తల్లి తన కొడుకు కనిపించడం లేదని ఏడుస్తున్నా పట్టించుకోని పవన్ కల్యాణ్... తెలంగాణలో ఎవరో అనారోగ్యంతో ఉంటే మాత్రం పరామర్శించడానికి వెళ్లారని ఎద్దేవా చేశారు.

## ఏపీలో 2.20 లక్షల వితంతు పింఛన్లు

విజయవాడ, జూన్ 17 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వితంతు మహిళలకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో త్వరలోనే కొత్తగా 2.20 లక్షల మందికి వితంతు పింఛన్లను మంజూరు చేయనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. అర్హులైన మహిళలకు రాబోయే ఒకటి రెండు నెలల్లో ప్రతి నెలా రూ. 4 వేల చొప్పున పింఛను అందించేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఏపీలో ప్రస్తుతం 62.34 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు ఇస్తున్నామని, ఇందుకోసం ఏటా రూ. 33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే అని స్పష్టం చేశారు. పింఛను తీసుకునే భర్త చనిపోతే, భార్యకు తక్షణమే 'స్పౌజ్ కేటగిరీ' కింద పెన్షన్ బదిలీ చేస్తున్నామని, దీనివల్ల ఇప్పటికే 2.45 లక్షల మందికి లబ్ధి చేకూరిందని చెప్పారు.

# ఎస్బీఐ భూమికి సర్కారు టోకరా!

**రాయదుర్గంలో ఎకరం రూ.237 కోట్లు.. మా భూమి అని హైకోర్టుకెక్కిన బ్యాంక్**




హైదరాబాద్, జూన్ 17 (ఈవార్తలు): హైదరాబాద్ మహానగరంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతంగా మారిపోయిన రాయదుర్గం ప్రాంతంలో ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన భూముల వేలం పెను సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. రికార్డు స్థాయిలో ఎకరం రూ.237 కోట్లకు వేలంలో అమ్ముడుపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే ఇప్పుడు ఆ భూముల చుట్టూ వివాదం చెలరేగింది. రాయదుర్గం పరిధిలోని ఐటీ హబ్‌లో తెలంగాణ సర్కార్ ఇటీవల నిర్వహించిన భూముల వేలంపై దేశీయ దిగ్గజం బ్యాంక్.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వం వేలం వేసిన భూమిలో తమకు కొంత భూమి ఉందని.. తమ భూమిని విక్రయించారని పేర్కొంటూ ఎస్బీఐ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. అయితే ఎస్బీఐ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై హైకోర్టు.. గురువారం విచారణ జరపనుంది. మే 28వ తేదీన రాయదుర్గం పరిధిలోని నాలెడ్జ్ సిటీలో ఉన్న సర్వే నంబర్ 83/1లోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములను తెలంగాణ ప్రభుత్వం బహిరంగ వేలం ద్వారా విక్రయించింది. టీజీఐఐసీ ద్వారా తెలంగాణ ప్రభుత్వం రాయదుర్గంలోని 11.38 ఎకరాల భూమిని వేలం వేసి.. మొత్తంగా రూ.2,529 కోట్లను రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు సమకూర్చింది. ఈ వేలంలో ఒక్కో ఎకరానికి కనీస ధరను రూ.170 కోట్ల చొప్పున ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ వేలంలో ఊహించని ధర పలికింది. ఈ వేలంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ గౌరా వెంచర్స్ ఏకంగా ఎకరం భూమిని రూ.237 కోట్లకు దక్కించుకుని పెను సంచలనం రేపింది. అయితే రూ. వందల కోట్ల ఆదాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బహిరంగ వేలంపై ఎస్బీఐ రంగంలోకి దిగింది. సర్వే నంబర్ 83/1 పరిధిలోని భూమిలో తమ బ్యాంక్‌కు 5 ఎకరాల స్థలం ఉందని పేర్కొంది. ఆ భూమికి సంబంధించిన పూర్తి హక్కులు తమ వద్దే ఉన్నాయని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తమ పేరు మీద ఉన్న భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎలా ఏకపక్షంగా వేలం నిర్వహిస్తుందని ప్రశ్నించింది. ఈ వేలం ప్రక్రియను రద్దు చేయాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. దీంతో రూ.కోట్ల విలువైన భూ వివాదానికి సంబంధించిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు గురువారం విచారణ చేయనుంది.

# 20 తర్వాతే రుతుపవనాల విస్తరణ

**రాష్ట్రంలో ఆగని వడగాల్పులు.. ఉత్తర, తూర్పు జిల్లాలకు హెచ్చరికలు**



హైదరాబాద్, జూన్ 17 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ, ఎండల తీవ్రత నుంచి ప్రజలకు ఇప్పుడిప్పుడే ఉపశమనం లభించే సూచనలు కనిపించడం లేదు. జూన్ 20వ తేదీ వరకు రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో పొడి వాతావరణమే నెలకొంటుందని, రానున్న మూడు రోజుల పాటు ఉత్తర, తూర్పు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా నివేదికల ఆధారంగా ఈ హెచ్చరికలు జారీ అయ్యాయి. బుధవారం ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు నమోదయ్యాయి. ఈ క్రమంలో జూన్ 17, 18, 19 తేదీల్లో ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. గడిచిన 24 గంటల్లో సూర్యాపేట జిల్లా మోతేలో అత్యధికంగా 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఖమ్మం జిల్లా ఏడుపాలెంలో 43.5 డిగ్రీలు, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటు హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు హైదరాబాద్, భద్రాచలం మీదుగా ప్రయాణిస్తున్నాయి. రానున్న 4-5 రోజుల్లో ఇవి రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించడానికి సానుకూల పరిస్థితులు ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే, ఉత్తర, మధ్య, తూర్పు జిల్లాల్లో రుతుపవనాలు పూర్తిస్థాయిలో విస్తరించడానికి జూన్ 20-21 వరకు సమయం పట్టవచ్చు. ఈ లోగా పలుచోట్ల సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. రాబోయే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని, ఆ తర్వాత 2-3 డిగ్రీల మేర తగ్గుముఖం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు.

## ముంపు ప్రాంతాలను ఆదుకుంటాం

**పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ హామీ**

**ఫైళ్లకే పరిమితం కావొద్దని హరీశ్ సూచన**

హైదరాబాద్, జూన్ 17 (ఈవార్తలు): తెలంగాణ సరిహద్దు గ్రామాలను భయపెడుతున్న పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ముంపు సమస్యపై ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సమర్పించిన వినతిపత్రంపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 'పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ' సానుకూలంగా స్పందిస్తూ రాతపూర్వక హామీ ఇచ్చింది. ఈ లేఖకు సంబంధించిన వివరాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఎక్స్ వేదికగా పంచుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం కారణంగా తెలంగాణ పరిధిలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను రెండు విధాలుగా ఆదుకుంటామని అథారిటీ స్పష్టం చేసింది. ఒకటి.. తగిన ఇంజనీరింగ్ పనుల ద్వారా ఆయా గ్రామాలకు ముంపు ముప్పు లేకుండా రక్షించడం. రెండు.. అది సాధ్యం కాకపోతే పునరావాస-పునర్నిర్మాణ చట్టం కింద ఆ భూములను సేకరించి రైతులకు పక్కా నష్టపరిహారం అందించడం. 2025 ఏప్రిల్ 8న జరిగిన అంతర్రాష్ట్ర సమావేశ నిర్ణయాలకు తాము కట్టుబడి ఉన్నామని పీపీఏ తెలిపింది. గోదావరి బేసిన్ పరిధిలోని తెలంగాణ ప్రజల జీవనోపాధిని, గిరిజనుల వ్యవసాయ భూములను కాపాడటానికి శాస్త్రీయ అంచనాలు, సమగ్ర వరద నివారణ చర్యలు తీసుకుంటామని లేఖలో పునరుద్ఘాటించింది. తెలంగాణ ప్రజల ప్రాణాలకు, ప్రయోజనాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని పేర్కొంది.

## పంటల మార్పిడి చేపడదాం

అమరావతి, జూన్ 17 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో వ్యవసాయ, ఉద్యానవనం, ఆక్వా రంగాలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, పంట మార్పిడి దిశగా రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతులను పెద్ద ఎత్తున ప్రకృతి సేద్యం వైపు మళ్లించేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌కు ప్రాధాన్యత పెరుగుతున్న దృష్ట్యా, ఈ అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి చైతన్య కార్యక్రమాల్లో తాను కూడా స్వయంగా పాల్గొంటానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతులు శాస్త్రీయ విధానాల్లో సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మిర్చి, పొగాకు, తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పొగాకు కొనుగోలుదారులతో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించే వరకు పంటను నిల్వ చేసుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. అధిక డిమాండ్ ఉన్న పప్పు దినుసుల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చూడాలన్నారు.

## పరిస్థితులు బాలేవు.. వరి వద్దు!

**రైతులకు మంత్రి తుమ్మల పిలుపు**

ఖమ్మం, జూన్ 17 (ఈవార్తలు): ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో వర్షాలు కాస్త తగ్గే సూచనలు ఉన్నాయని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగును కాస్త తగ్గించి, మంచి లాభాలనిచ్చే ఆయిల్‌పామ్ వైపు దృష్టి పెట్టాలని రైతులను ఆయన కోరారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలతో ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేయడం ప్రస్తుతానికి మంచి నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక ఎరువుల కొరత గురించి రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90.22 లక్షల బస్తాల యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇందులో మార్క్‌ఫెడ్ వద్ద అత్యధికంగా 59.56 లక్షల బస్తాలు ఉండగా.. రిటైల్ షాపుల్లో 22.67 లక్షలు, సహకార సంఘాల్లో 5.56 లక్షలు, గోడౌన్లలో మరో 3.56 లక్షల బస్తాల స్టాక్ అందుబాటులో ఉందని వెల్లడించారు. సకాలంలో ఎరువులు అందించేందుకు ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. టెక్నాలజీని వాడుకుంటూ రైతులు సులభంగా ఎరువులు పొందేలా ప్రభుత్వం తీసుకొచ్చిన ఫర్టిలైజర్ యాప్‌కు కూడా మంచి స్పందన వస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు దీని ద్వారా 13.22 లక్షల బస్తాలను బుక్ చేసుకోగా, అందులో 11.18 లక్షల బస్తాలు ఇప్పటికే రైతులకు చేరిపోయాయని చెప్పారు. రైతుల ఫీడ్‌బ్యాక్ ప్రకారం ఈ యాప్‌లో నిరంతరం మార్పులు చేస్తున్నామని, ఒకవేళ స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఉంటే వారి కోసం ప్రత్యేకంగా టోల్-ఫ్రీ నంబర్ ద్వారా బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని కూడా కల్పించామని వెల్లడించారు.

## నిరంజన్ ధైర్యం స్ఫూర్తిదాయకం: పవన్

హనుమకొండ, జూన్ 17 (ఈవార్తలు): ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమానిని పరామర్శించేందుకు ఆయన ఈరోజు వరంగల్ జిల్లా హనుమకొండకు వెళ్లారు. పర్యటన ముగిసిన అనంతరం, తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ చేశారు. కొన్ని రోజుల క్రితం హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు, తాను ఓ అరుదైన వ్యాధితో పోరాడుతున్నానని, తన అభిమాన నటుడు పవన్ కల్యాణ్‌ను కలవడమే తన కోరిక అని పేర్కొంటూ ఓ వీడియో విడుదల చేశాడు. ఆ వీడియో పవన్ దృష్టికి చేరింది. దీంతో వెంటనే స్పందించిన ఆయన, అభిమాని ఆకాంక్షను నెరవేర్చాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఈరోజు నేరుగా హనుమకొండలోని నిరంజన్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ నిరంజన్ ప్రదర్శిస్తున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం తనను ఎంతగానో కదిలించిందని పవన్ పేర్కొన్నారు."అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో నిరంజన్ అసాధారణ ధైర్యం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు ఎంతో స్ఫూర్తిదాయకం. అతని మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని ప్రార్థించాను.

## ఒప్పందం నచ్చకపోతే మళ్లీ బాంబులేస్తాం

### ఇరాన్‌కు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

ప్యారిస్: అమెరికా-ఇరాన్ మధ్య నెలల తరబడి కొనసాగిన ఉద్రిక్తతలకు ముగింపు పలికే ఒప్పందం కుదిరే దశలో ఉన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఒప్పంద ముసాయిదా తనకు నచ్చకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభిస్తామని హెచ్చరించారు. దీంతో ఇప్పటికే సున్నితంగా ఉన్న పశ్చిమాసియా పరిస్థితులపై మరోసారి దృష్టి కేంద్రీకృతమైంది. ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసితో కలిసి మీడియాతో మాట్లాడిన ట్రంప్.. అమెరికా-ఇరాన్ మధ్య కుదరబోయే ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదని చెప్పారు. ప్రస్తుతం అది కేవలం అవగాహన ఒప్పందం మాత్రమేనని పేర్కొన్నారు. "ఆ ఒప్పందం నాకు నచ్చకపోతే మళ్లీ వారిపై కాల్పులు జరుపుతాం. వారి తలలపై బాంబులు వేయడం మొదలుపెడతాం" అంటూ ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రవర్తన సరిగా లేకపోయినా అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలు మళ్లీ అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించాయి.

## ప్రవాసుడికి అబుదాబిలో 5 కోట్ల లాటరీ

షార్జా: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నివసిస్తున్న ఒక ప్రవాస భారతీయుడిని అదృష్టం వరించింది. బ్యాంకులో ఖాతా ప్రారంభించిన రెండు నెలలు కూడా గడవకముందే ఆయన ఏకంగా 2 మిలియన్ దిర్హామ్‌ల (భారత కరెన్సీలో సుమారు రూ.5.15 కోట్లు) భారీ జాక్‌పాట్‌ను సొంతం చేసుకున్నాడు. అబుదాబిలో నివసిస్తున్న 34 ఏళ్ల షజీర్ వెంగా ఈ బంపర్ ప్రైజ్ విజేతగా నిలిచాడు. షార్జా ఇస్లామిక్ బ్యాంక్ (ఎస్ఐబీ) తన వినియోగదారుల కోసం ఏటా నిర్వహించే 'మిలియనీర్ క్యాంపెయిన్'లో భాగంగా, జూన్ నెలకు సంబంధించి నిర్వహించిన డ్రాలో షజీర్‌ను విజేతగా ప్రకటించారు. కేవలం రెండు నెలల క్రితమే షజీర్ ఎస్ఐబీ డిజిటల్ యాప్ ద్వారా సేవింగ్స్ ఖాతా తెరిచాడు. బ్యాంకు నిబంధనల ప్రకారం, ఖాతాలో జమ చేసే ప్రతి 10,000 దిర్హామ్‌ల డిపాజిట్‌కు ఒక డ్రా ఎంట్రీ లభిస్తుంది. ఖాతాదారులలో పొదుపు అలవాటును ప్రోత్సహించేందుకు బ్యాంక్ ఈ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తోంది. ఈ విజయంపై షజీర్ వెంగా హర్షం వ్యక్తం చేశాడు. ఈ బహుమతి తన జీవితాన్ని గొప్ప మలుపు తిప్పుతుందని, గెలుచుకున్న సొమ్ముతో భారతదేశంలో ఉన్న తన కుటుంబాన్ని యూఏఈకి తీసుకువస్తానని ఆయన తెలిపారు. ఈ క్యాంపెయిన్ గురించి తెలుసుకున్న నాటి నుండి, ఎప్పటికైనా విజేతగా నిలవాలనే ఆశతో ఇందులో పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ డ్రాలో షజీర్‌తో పాటు మరికొందరు నగదు బహుమతులను, ఒక లగ్జరీ కారును కూడా గెలుచుకున్నారు.

## అంతరిక్షంలోకి భారత సంతతి వ్యోమగామి

### సిద్ధమైన అనిల్ మీనన్.. జులై 14న ఐఎస్ఎస్‌కు పయనం

న్యూయార్క్: భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి డాక్టర్ అనిల్ మీనన్ తన తొలి అంతరిక్ష యాత్రకు సిద్ధమయ్యారు. 2026 జులై 14న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పయనమవనున్న ఆయన, అక్కడ సుమారు ఎనిమిది నెలల పాటు (240 రోజులు) గడపనున్నారు. ఈ మిషన్‌లో ఆయన ఫ్లైట్ ఇంజనీర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కజకిస్థాన్‌లోని బైకనూర్ కాస్మోడ్రోమ్ నుంచి రష్యాకు చెందిన సోయుజ్ ఎంఎస్-29 వ్యోమనౌక ద్వారా అనిల్ మీనన్ తన ప్రయాణాన్ని ప్రారంభిస్తారు. ఆయనతో పాటు వ్యోమగాములు ప్యోటర్ దుబ్రోవ్, అన్నా కికినా కూడా ఈ యాత్రలో పాలుపంచుకోనున్నారు. అంతరిక్ష కేంద్రంలో ఉన్న సమయంలో ఈ బృందం ఎక్స్‌పెడిషన్ 74, 75లలో భాగంగా వివిధ శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ప్రయోగాలు నిర్వహించనుంది. 2027 వసంతకాలంలో వీరు తిరిగి భూమికి చేరుకుంటారు. భారత, ఉక్రెయిన్ వలస దంపతుల కుమారుడైన అనిల్ మీనన్ మిన్నెసోటాలో జన్మించారు. ఆయన హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి న్యూరోబయాలజీలో, స్టాన్‌ఫోర్డ్ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ మరియు మెడిసిన్ విభాగాల్లో పట్టా పొందారు. 2021లో నాసా వ్యోమగామిగా ఎంపికవడానికి ముందు ఆయన నాసా ఫ్లైట్ సర్జన్‌గా, స్పేస్ఎక్స్ సంస్థలో తొలి ఫ్లైట్ సర్జన్‌గా సేవలందించారు. ఆయన భార్య అన్నా మీనన్ కూడా నాసా వ్యోమగామి కావడం విశేషం. ఈ యాత్ర అంతరిక్ష రంగంలో అంతర్జాతీయ సహకారానికి, నాసాలో భారత సంతతి నిపుణుల పెరుగుతున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. తన యాత్రకు ముందు, జూన్ 22 నుంచి రష్యాలోని స్టార్ సిటీ నుంచి అనిల్ మీనన్ పరిమితంగా వర్చువల్ మీడియా ఇంటర్వ్యూలలో పాల్గొంటారని నాసా అధికారికంగా ప్రకటించింది.

## లాభాల్లోనే దేశీయ మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు పైకి ఎగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయానికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించినప్పటికీ మార్కెట్లు సానుకూల ధోరణి కనబరిచాయి. సెన్సెక్స్ 347 పాయింట్లు పెరిగి 77,155 వద్ద ముగిసింది. నిఫ్టీ 96 పాయింట్లు లాభపడి 24,085 వద్ద స్థిరపడింది. కీలక షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో నిఫ్టీ మరోసారి 24 వేల మార్క్‌ను అధిగమించింది. ట్రెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో ఇండస్ట్రీస్ షేర్లు అత్యధిక లాభాలు నమోదు చేశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.52 శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్ సూచీ 0.79 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సూచీ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. ఆ తర్వాత కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్ సూచీలు నిలిచాయి. ఆటో, రియాల్టీ రంగాల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎంసీ) సమావేశ ఫలితాల కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి, భవిష్యత్ వడ్డీ రేట్లపై ఫెడ్ చేసే వ్యాఖ్యలపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 94.50 స్థాయి వద్ద స్థిరంగా కదిలింది. డాలర్ సూచీ, ముడి చమురు ధరలు పరిమిత శ్రేణిలోనే కదలడంతో కరెన్సీ మార్కెట్లు కూడా వేచి చూసే ధోరణిలోనే కొనసాగాయి.

## ఎంపీల ఫోన్లు స్విచ్ఛాఫ్

### 'ఉద్ధవ్ సేన'లో తిరుగుబాటు ఆందోళన!

ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి సంచలన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ)లో తిరుగుబాటు సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీకి చెందిన పలువురు లోక్‌సభ సభ్యులు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనతో సంప్రదింపులు జరుపుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేల తిరుగుబాటు పర్వం మరవకముందే ఈ పరిణామాలు తెరపైకి రావడం దేశ రాజకీయాల్లో సంచలనంగా మారింది. పార్టీ సీనియర్ నేతలు సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ కొందరు ఎంపీల ఫోన్లు స్విచ్ఛాఫ్‌గా ఉండటంతో ఉద్ధవ్ వర్గంలో ఆందోళన నెలకొంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఉద్ధవ్ ఠాక్రే స్వయంగా రంగంలోకి దిగినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం యూబీటీకి చెందిన సంజయ్ దినా పాటిల్, సంజయ్ దేశ్‌ముఖ్, నగేశ్ పాటిల్ అష్టికర్, ఓంరాజే నింబాల్కర్, భౌసాహెబ్ వక్చౌరే, సంజయ్ జాధవ్ తదితరులు షిండే వర్గంతో సంప్రదింపులు జరుపుతున్నారు. మరో ఎంపీ రాజాభౌ వాజే పేరు కూడా వినిపిస్తోంది. ఈ ఎంపీలు ఢిల్లీలో షిండే వర్గానికి చెందిన లోక్‌సభ సభ్యుడు శ్రీకాంత్ షిండే నివాసంలో సమావేశమయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అనంతరం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ప్రత్యేక పార్లమెంటరీ వర్గం ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసి, తర్వాత షిండే నేతృత్వంలోని శివసేనలో విలీనం కావచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# మెటా.. పెయిడ్ ప్లస్‌లు!

## నెలకు రూ.99కి ప్రీమియం ఫీచర్లు




న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లకు సంబంధించి మాతృసంస్థ 'మెటా ప్లాట్‌ఫామ్స్' ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఉచితంగా అందిస్తున్న ఈ యాప్‌లలో అదనపు ఫీచర్ల కోసం ఐచ్ఛిక పెయిడ్ సబ్‌స్క్రిప్షన్లను అందుబాటులోకి తెచ్చింది. 'ప్లస్' పేరుతో వస్తున్న ఈ కొత్త సేవలు మే నెలాఖరు నుంచి ప్రపంచవ్యాప్తంగా దశలవారీగా అమల్లోకి వచ్చాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో వేల కోట్ల డాలర్లు పెట్టుబడిగా పెడుతున్న తరుణంలో, కేవలం ప్రకటనల ఆదాయంపైనే ఆధారపడకుండా కొత్త ఆదాయ మార్గాలను సృష్టించుకోవడమే లక్ష్యంగా మెటా ఈ అడుగు వేసింది. ఈ కొత్త ప్లాన్ల ప్రకారం, 'ఇన్‌స్టాగ్రామ్ ప్లస్', 'ఫేస్‌బుక్ ప్లస్' కోసం నెలకు సుమారు 3.99 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. భారత్‌లో దీని ధరను ప్రారంభ ఆఫర్లతో కలిపి సుమారు రూ.99గా నిర్ణయించారు. అదేవిధంగా 'వాట్సాప్ ప్లస్' సబ్‌స్క్రిప్షన్ కోసం నెలకు 2.99 డాలర్లు (భారత్‌లో సుమారు రూ.99) చెల్లించాలి. ఈ ప్లాన్లు తీసుకున్న యూజర్లకు స్టోరీల నిడివి పెంచుకోవడం, ప్రొఫైల్ కస్టమైజేషన్, సూపర్ రియాక్షన్లు, సీక్రెట్ స్టోరీ వ్యూయింగ్, మరిన్ని చాట్‌లను పిన్ చేసుకునే సౌలభ్యం వంటి పలు ప్రీమియం ఫీచర్లు అందుబాటులోకి వస్తాయి. అయితే, ప్రస్తుతం ఉన్న ప్రాథమిక సేవలు యథాతథంగా అందరికీ ఉచితంగానే కొనసాగుతాయని, వాటిలో ఎలాంటి మార్పు ఉండదని మెటా స్పష్టం చేసింది. మెటా ఈ ఏడాది తన మూలధన వ్యయాన్ని ఏకంగా 125 బిలియన్ డాలర్ల నుంచి 145 బిలియన్ డాలర్లకు పెంచింది. ఈ భారీ మొత్తాన్ని ప్రధానంగా ఏఐ డేటా సెంటర్లు, కంప్యూటింగ్ పవర్, ఇతర మౌలిక సదుపాయాల కోసమే కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రకటనలకు అతీతంగా స్థిరమైన ఆదాయాన్ని సమకూర్చుకోవడం కంపెనీకి అత్యవసరంగా మారింది. ఇటీవలే భారత్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో కలిసి గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఒక ఏఐ డేటా సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు మెటా ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం. ఈ కొత్త సబ్‌స్క్రిప్షన్ల ద్వారా దీర్ఘకాలంలో కంపెనీకి గణనీయమైన ఆదాయం లభించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. యూజర్లు కోరుకుంటున్న ఎన్నో మెరుగైన ఫీచర్లను ఈ 'ప్లస్' సేవల్లో అందిస్తున్నామని మెటా ప్రొడక్ట్ హెడ్ నవోమి గ్లీట్ తెలిపారు. త్వరలో వ్యాపారాలు, క్రియేటర్ల కోసం, అలాగే నెలకు 19.99 డాలర్ల వరకు ఉండే అధునాతన ఏఐ ఫీచర్ల కోసం కూడా ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్లను పరీక్షిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. అయితే, ఈ కొత్త పెయిడ్ ప్లాన్లపై నిపుణుల నుంచి, యూజర్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఏఐపై చేస్తున్న భారీ ఖర్చును సమర్థించుకోవడానికి మెటాకు ఇలాంటి ఆదాయ మార్గాలు అవసరమని 'టెకార్క్' నిపుణుడు ఫైసల్ కవూసా అభిప్రాయపడగా, ఏఐ పెట్టుబడులపై బలమైన రాబడి వచ్చే వరకు ఇవి కేవలం ఒక 'స్టాప్‌గ్యాప్' ఏర్పాటు మాత్రమేనని ఏఐ నిపుణుడు శ్రీనివాస్ పద్మనాభుని పేర్కొన్నారు. పవర్ యూజర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు మినహా సాధారణ యూజర్లు డబ్బు చెల్లించి ఈ సేవలు పొందేందుకు పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చని ప్రాథమిక స్పందనలు సూచిస్తున్నాయి.

# అవసరం లేని పాలసీలు, లోన్లు అంటగట్టొద్దు

### బ్యాంకుల ఇష్టం చెల్లదు: ఆర్‌బీఐ




న్యూఢిల్లీ: బ్యాంకుకు ఓ పనిమీద వెళ్తే మరో ప్రొడక్ట్‌ను అంటగట్టడం, లోన్ తీసుకోవాలంటే బీమా పాలసీ తప్పనిసరి అని చెప్పడం, మొబైల్ యాప్ తెరిస్తే వరుసగా లోన్ ఆఫర్లు చూపించడం వంటి పద్ధతులకు త్వరలో చెక్ పడనుంది. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆర్‌బీఐ కఠిన నిబంధనలను తీసుకొచ్చింది. బ్యాంకులు అనుసరించాల్సిన కొత్త మార్గదర్శకాలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటి వరకు బ్యాంకింగ్ రంగంలో తరచూ వినిపించిన ఫిర్యాదుల్లో 'మిస్ సెల్లింగ్' ఒకటి. అంటే వినియోగదారుడికి అవసరం లేని ఫైనాన్షియల్ ప్రొడక్ట్‌ను అమ్మడం. సరైన సమాచారం ఇవ్వకుండా ఒప్పించడం. అనుమతి లేకుండానే పాలసీలు లేదా ఇతర సేవలు జత చేయడం వంటి చర్యలు ఇందులోకి వస్తాయి. ఇలాంటి వ్యవహారాలకు తొలిసారి స్పష్టమైన నిర్వచనం ఇచ్చిన ఆర్‌బీఐ వాటిపై కఠిన వైఖరి అవలంబించింది. కొత్త నిబంధనల ప్రకారం రుణం మంజూరు చేయాలంటే తప్పనిసరిగా బీమా పాలసీ కొనాలని బ్యాంకులు షరతు విధించకూడదు. గృహ రుణం లేదా వ్యక్తిగత రుణం తీసుకునే సమయంలో బీమా అవసరమైతే వినియోగదారుడు తనకు నచ్చిన సంస్థ నుంచి పాలసీ తీసుకునే స్వేచ్ఛ ఉండాలి. బ్యాంకు సూచించిన సంస్థ నుంచే కొనాలంటూ ఒత్తిడి చేయడం నిషేధం. వినియోగదారుడి సమ్మతికి కూడా కొత్త నిర్వచనం తీసుకొచ్చింది ఆర్‌బీఐ. ఒక ఉత్పత్తికి ఇచ్చిన అంగీకారాన్ని మరో ప్రొడక్ట్‌ను వర్తింపచేయకూడదు. రుణం తీసుకున్న వ్యక్తికి అదే ఆధారంగా బీమా, పెట్టుబడి పథకాలు లేదా ఇతర ఆఫర్లను పంపడం కుదరదు. ప్రతి ఉత్పత్తికి విడిగా స్పష్టమైన అనుమతి తీసుకోవాల్సిందే. డిజిటల్ వేదికల్లో బ్యాంకులు అనుసరిస్తున్న పలు పద్ధతులపై కూడా ఆర్‌బీఐ దృష్టి పెట్టింది. కస్టమర్లను మభ్యపెట్టేలా కౌంట్‌డౌన్ టైమర్లు చూపించడం, ముందుగానే టిక్ చేసిన ఆప్షన్స్ ఉంచడం, తిరస్కరించే బటన్‌ను గందరగోళంగా చూపించడం, మూసివేయాలనుకుంటే లోన్ పేజీకి తీసుకెళ్లే పాప్‌అప్‌లు చూపించడం వంటి పద్ధతులను నిషేధించింది. లోన్ దరఖాస్తు సమయంలో వినియోగదారుడికి తెలియకుండా బీమా పాలసీని జత చేయడం, చివరి దశలో అదనపు ఛార్జీలను చూపించడం, అత్యవసర హెచ్చరికలా కనిపించే ప్రకటనలు పంపించడం వంటి చర్యలు కూడా ఇక అనుమతించబోవడం లేదు. బ్యాంకుల తరఫున పనిచేసే డైరెక్ట్ సేలింగ్ ఏజెంట్లు, మార్కెటింగ్ ప్రతినిధులపైనా కొత్త నియంత్రణలు అమల్లోకి రానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల మధ్య మాత్రమే వినియోగదారులను సంప్రదించాలి. అనుమతి లేకుండా ఇంటికి లేదా కార్యాలయానికి వెళ్లకూడదు. తమను బ్యాంకు ఉద్యోగులుగా పరిచయం చేసుకోవడం కూడా నిషేధం. ఈ మార్గదర్శకాల ప్రకారం నిబంధనలు ఉల్లంఘించి వినియోగదారుడికి తప్పుడు ప్రొడక్ట్‌ను విక్రయించినట్లు తేలితే బ్యాంకు వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. వినియోగదారుడు ఎదుర్కొన్న నష్టానికి పరిహారం కూడా ఇవ్వాల్సి రావచ్చు.

## మా నావికుల భద్రత మాకు ముఖ్యం

### ట్రంప్ ఎదుటే గళమెత్తిన మోదీ

ప్యారిస్: ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ-7 శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ నావికుల భద్రత అంశాన్ని బలంగా ప్రస్తావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన సందర్భంగా, ఇటీవలే అమెరికా జరిపిన సైనిక దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనను ఆయన పరోక్షంగా గుర్తుచేశారు. వేలాది మంది భారత నావికుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, వారికి తగిన రక్షణ కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. పశ్చిమాసియాలో శాంతి స్థాపన దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ప్రధాని స్వాగతిస్తూనే, అక్కడి ఉద్రిక్తతల కారణంగా భారత పౌరులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రపంచ వాణిజ్యం కోసం దేశాలను అనుసంధానించే నావికుల భద్రత మనందరి ఉమ్మడి బాధ్యత. సముద్ర వాణిజ్య మార్గాలు సురక్షితంగా ఉండేలా చూస్తూ, వారు ఎటువంటి భయాందోళనలు లేకుండా విధులు నిర్వహించే వాతావరణాన్ని కల్పించాలి" అని మోదీ ఉద్ఘాటించారు. హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు జరుగుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలోనే కీలకమైన వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. హర్మూజ్ జలసంధి వద్ద ఎటువంటి ఆంక్షలు ఉండకూడదని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం నిరంతరాయంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఇటీవల ఒమన్ సమీపంలో ఒక వాణిజ్య నౌకపై అమెరికా జరిపిన సైనిక దాడిలో భారతీయ సిబ్బంది మరణించిన ఘటనపై భారత్ ఇప్పటికే అమెరికాకు దౌత్యపరంగా తన నిరసనను తెలియజేసింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భారతీయులు నావికులుగా సేవలందిస్తున్న నేపథ్యంలో, సంఘర్షణ ప్రాంతాల్లో వారి భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# టెలిగ్రాంపై వేటు.. రాహుల్ ఫైర్

### దొంగను వదిలి బాధితుడికి తాళం వేయడమేని మండిపాటు



న్యూఢిల్లీ: నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్‌ను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పరీక్షల్లో అక్రమాలను, చీటింగ్ నెట్‌వర్క్‌లను నిరోధించే చర్యల్లో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై దేశవ్యాప్తంగా తాత్కాలిక ఆంక్షలు విధించింది. జూన్ 21న పరీక్ష జరగనున్న నేపథ్యంలో, జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ల నుంచి టెలిగ్రామ్‌ను తొలగించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. "దొంగను పట్టుకోవడం చేతకాక, బాధితుడి ఇంటికి తాళం వేసినట్లుంది" అంటూ 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు. పేపర్ లీకేజీలను అరికట్టేందుకు మోదీ ప్రభుత్వం ఇదొక కొత్త ఉపాయాన్ని కనిపెట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. అసలైన పేపర్ లీక్ మాఫియాను విడిచిపెట్టి, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది విద్యార్థులు తమ నోట్స్, టెస్ట్ సిరీస్‌ల కోసం టెలిగ్రామ్‌పైనే ఆధారపడతారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయితే, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సమర్థించుకుంది. వ్యవస్థీకృత చీటింగ్ ముఠాలు రీ-టెస్ట్‌లో మోసాలకు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా నిరోధించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. పరీక్ష పత్రాల భద్రతను పర్యవేక్షించేందుకు భారత వైమానిక దళం (ఐఏఎఫ్) సహాయాన్ని కూడా తీసుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. టెలిగ్రామ్ నిషేధంపై ఆ సంస్థ సీఈఓ పావెల్ డ్యూరోవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు చేసే తప్పులకు భారత్‌లోని 15 కోట్ల మంది వినియోగదారులను శిక్షించడం భావ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం యాప్ స్టోర్ల నుంచి టెలిగ్రామ్‌ను తొలగించినప్పటికీ, ఇప్పటికే మొబైల్స్‌లో యాప్ ఉన్నవారు వీపీఎన్ సాయంతో దీనిని యాక్సెస్ చేస్తున్నారు. గత మే నెలలో జరిగిన నీట్-యూజీ పరీక్ష పత్రం లీకైనట్లు వచ్చిన ఆరోపణలతో పరీక్ష రద్దయిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై ప్రస్తుతం సీబీఐ విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే రీ-ఎగ్జామ్‌ను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. కాగా, ఈ తాత్కాలిక నిషేధంపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు విపక్ష నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

## 'మోస్ట్ వాంటెడ్' మహిళా నేత శకుంతల సరెండర్

కోల్‌కతా: ఆపరేషన్ కగార్ ప్రభావంతో మావోయిస్టు పార్టీలో సరెండర్ల పర్వం కొనసాగుతోంది. తాజాగా, రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ బలగాలకు తలనొప్పిగా మారిన మహిళా మావోయిస్టు నేత శకుంతల అలియాస్ పుష్ప లొంగిపోయారు. ఒక తుపాకీ, 40 రౌండ్ల తూటాలతో కోల్‌కతా పోలీసుల ముందు ఆమె సరెండర్ అయ్యారు. ఆమెపై ప్రభుత్వం రూ.10 లక్షల రివార్డు ప్రకటించిన సంగతి గమనార్హం. ఈ సందర్భంగా కోల్‌కతా పోలీస్ కమిషనర్ అజయ్ నంద్ మాట్లాడుతూ, శకుంతల 2001లో చిన్న వయసులోనే మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితురాలై సంస్థలో చేరినట్లు తెలిపారు. తొలుత సాంస్కృతిక విభాగంలో విప్లవ గీతాలు, ప్రచార కార్యక్రమాలు, కరపత్రాల పంపిణీలతో చురుగ్గా పని చేశారు. తర్వాత పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీలో కీలక నేతగా ఎదిగారు. దల్మా జోన్ జోనల్ కమిటీ సభ్యురాలిగా బీహార్-జార్ఖండ్-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో అనేక హింసాత్మక ఘటనల్లో ఆమె పాత్ర ఉన్నట్లు వెల్లడించారు.

## క్షమాపణ చెప్పి, కోటి కట్టు!

### స్టాలిన్‌కు టీవీకే నేత లీగల్ నోటీసు

చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో మరో తీవ్ర వివాదం రాజుకుంది. డ్రగ్స్ స్మగ్లింగ్ కేసుతో తనకు సంబంధం ఉందంటూ నిరాధార ఆరోపణలు చేశారంటూ తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత ఆదవ్ అర్జున.. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌కు, డీఎంకే ఐటీ వింగ్‌కు లీగల్ నోటీసు పంపారు. 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అరెస్ట్ చేసిన జాన్ బ్రిట్టో అనే వ్యక్తితో తనకు సంబంధాలు అంటగడుతూ డీఎంకే, దాని అనుబంధ విభాగాలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాయని ఆదవ్ అర్జున తన నోటీసులో ఆరోపించారు. ఈ నిరాధారమైన, కల్పితమైన ఆరోపణల వల్ల తన ప్రతిష్ఠకు తీవ్ర భంగం వాటిల్లిందని, తాను మానసిక వేదనకు గురయ్యానని పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే తనను నేర కార్యకలాపాలతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డీఎంకే ఐటీ వింగ్‌తో పాటు ఎంకే స్టాలిన్ కూడా తనకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదవ్ అర్జున డిమాండ్ చేశారు. నోటీసు అందుకున్న 48 గంటల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని గడువు విధించారు. క్షమాపణతో పాటు తన పరువుకు కలిగించిన నష్టానికి, మానసిక క్షోభకు గాను రూ. 1 కోటి పరిహారంగా చెల్లించాలని కూడా నోటీసులో కోరారు. తాను నిర్దేశించిన గడువులోగా క్షమాపణ చెప్పి, పరిహారం చెల్లించడంలో విఫలమైతే.. స్టాలిన్‌తో పాటు ఈ ఆరోపణల వ్యాప్తికి కారణమైన ప్రతి ఒక్కరిపైనా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానని ఆదవ్ అర్జున స్పష్టం చేశారు.

## ఇరాన్‌పై దాడులకు 'గ్రోక్' సాయం

### 96 గంటల్లో 2000 టార్గెట్లు ఛేదన

వాషింగ్టన్: ప్రముఖ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాధనం 'గ్రోక్' (+తీశీని)ను ఇరాన్‌పై సైనిక దాడుల కోసం వినియోగించినట్లు అమెరికా ప్రభుత్వం సంచలన ప్రకటన చేసింది. ఈ అత్యాధునిక సాంకేతికత సాయంతో కేవలం 96 గంటల వ్యవధిలోనే ఇరాన్‌లోని 2,000 విభిన్న లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించినట్లు వెల్లడించింది. మస్క్‌కు చెందిన 'ఎక్స్ఏఐ' డేటా సంస్థ డేటా సెంటర్లకు సంబంధించిన ఒక పర్యావరణ కేసు విచారణ సందర్భంగా అమెరికా న్యాయశాఖ ఈ వివరాలను న్యాయస్థానానికి సమర్పించింది. జాతీయ భద్రతా ప్రయోజనాల దృష్ట్యా 'ఎక్స్ఏఐ' కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని ఈ సందర్భంగా వాదించింది. ఇందుకు మద్దతుగా పెంటగాన్ ఏఐ విభాగాధిపతి కామెరాన్ స్టాన్లీ ఇచ్చిన వాంగ్మూలాన్ని కోర్టుకు అందజేసింది. అమెరికా సైన్యానికి చెందిన 'ప్రాజెక్ట్ మావెన్' అనే ఏఐ టార్గెటింగ్ వ్యవస్థలో గ్రోక్‌ను అంతర్భాగం చేసినట్లు స్టాన్లీ తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్‌పై చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో డ్రోన్ ఫుటేజీని వేగంగా విశ్లేషించడంలోనూ, లక్ష్యాలను కచ్చితంగా గుర్తించడంలోనూ గ్రోక్ కీలక పాత్ర పోషించిందని ఆయన వివరించారు. గతంలో ఈ ప్రాజెక్ట్ కోసం పెంటగాన్ 'ఆంత్రోపిక్' సంస్థకు చెందిన 'క్లాడ్' అనే ఏఐ మోడల్‌ను వినియోగించింది. అయితే, నిఘా పద్ధతులపై తలెత్తిన విభేదాల కారణంగా ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకోవడంతో, ఆ స్థానంలో గ్రోక్‌ను చేర్చుకున్నారు.

## కల్లు తాగి పహాణి పుస్తకం పడేశారు?

**స్వాధీనం చేసుకున్న ఆర్ఐ రాణి.. గత ఎమ్మార్వో హయాంలో ఘటన??**

**ఘటనపై విచారణ చేపట్టాం: ఎమ్మార్వో**






(ఈవార్తలు ఎఫెక్ట్)

మల్యాల, జూన్ 17 (ఈవార్తలు): మల్యాల తహసీల్దార్ కార్యాలయానికి చెందిన 1984-85 సంవత్సరాల ఒరిజినల్ పహాని పుస్తకం కల్లు మండువాలో లభ్యమవడం కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై ఈవార్తలు దినపత్రిక బుధవారం సంచికలో 'పహాణి పత్రాల్లో గుడాల అమ్మకాలు!' పేరుతో కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాణి ఘటనాస్థలికి చేరుకొని పహాణి పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఎమ్మార్వో శ్రీనివాస్‌ను వివరణ కోరగా, విచారణ కొనసాగుతోందని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. కాగా, గతంలో ఇద్దరు రెవెన్యూ సిబ్బంది కల్లు తాగి పుస్తకాలను అక్కడే వదిలేశారని ప్రచారం జరుగుతోంది, అయితే అధికారికంగా నిర్ధారణ కాలేదు. ఈ పుస్తకం గత ఎమ్మార్వో హయాంలోనే కార్యాలయ రికార్డుల నుంచి మిస్ అయినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది.

## మల్యాల మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా కంధారి ముత్యం రెడ్డి



మల్యాల, జూన్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ముత్యంపేట ఉపసర్పంచ్ కంధారి ముత్యం రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయనను ఘనంగా సన్మానించి, ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మండలంలోని ఉపసర్పంచులందరినీ సమన్వయం చేసుకుంటూ, గ్రామాల సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉపసర్పంచులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

## అంగన్వాడీ బాట అవగాహన ర్యాలీ

మల్యాల, జూన్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల పట్టణంలో అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో "అమ్మ మాట - బడి బాట" కార్యక్రమం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను పాఠశాలల్లో చేర్పించి, వారి విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో అంగన్వాడీ టీచర్లు శిరీష, సబిత, సరస్వతి, కౌసల్య, రేణుక, సుజాత పాల్గొన్నారు. అలాగే ఉప సర్పంచ్ కట్కం వినయ్, వార్డు సభ్యులు బొబ్బిలి రేణుక, పోచంపల్లి లహరి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కొండగట్టు అంజన్న సేవలో గంగుల

మల్యాల, జూన్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు ఆలయ సుపరింటెండెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనం అందజేశారు. గంగులను ఆలయ సూపరింటెండెంట్ శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచారి కపిందర్, ఉపప్రధాన అర్చకుడు చిరంజీవి, ముఖ్య అర్చకులు పెద్ద రాము, అభిలాశ్, శ్రీకాంత్‌తో పాటు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## సర్కారు బడి పిల్లలకు పుస్తకాల పంపిణీ

మల్యాల, జూన్ 17 (ఈవార్తలు): మల్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొట్ల జయప్రద ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం గ్రామపంచాయతీ తరఫున అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హైపర్ యాక్షన్ ప్లాన్‌లో ఎన్పీడీసీఎల్: సీఈ

జగిత్యాల, జూన్ 17 (ఈవార్తలు): వర్షాకాలంలో ఈదురుగాలులు, భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఎన్పీడీసీఎల్ హైపర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు జగిత్యాల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. సుదర్శనం తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడమే ఈ ప్రణాళిక లక్ష్యమన్నారు. విద్యుత్ అంతరాయాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆరు అంచెల వ్యూహాన్ని రూపొందించినట్లు చెప్పారు. కంట్రోల్ రూమ్ అలర్ట్, నిరంతర పర్యవేక్షణ, సిబ్బంది సమీకరణ, వేగవంతమైన సమాచారం, పటిష్ట కార్యాచరణ, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు, నిర్దేశిత సమయంలో విద్యుత్ పునరుద్ధరణ ఇందులో భాగమన్నారు. ఎస్‌సీఏడీఏ, జీఐఎస్, ఓఎంఎస్ వ్యవస్థలను కృత్రిమ మేధ (ఏఐ)తో అనుసంధానించామని తెలిపారు. ఫీడర్లలో లోపాలను 7--21 రోజుల ముందుగానే గుర్తించడం, వాతావరణ ఆధారంగా విద్యుత్ డిమాండ్ అంచనా వేసి సరఫరాను నిర్వహించడం సాధ్యమవుతుందని చెప్పారు. అటవీ ప్రాంతాలు, క్లిష్ట ప్రాంతాల్లో డ్రోన్లతో లైన్ల పర్యవేక్షణ, నష్టాల గుర్తింపు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి సర్కిల్‌లో జీపీఆర్ఎస్ ట్రాకింగ్‌తో ఎమర్జెన్సీ వాహనాలను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ ప్లాన్‌తో వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గుతాయని ఎస్ఈ సుదర్శనం ఆశాభావం వ్యక్తం చేశారు.

## బీడీ కార్మికుల పిల్లల స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

జగిత్యాల, జూన్ 17 (ఈవార్తలు): 2026-27 విద్యా సంవత్సరానికి బీడీ కార్మికుల పిల్లలకు ప్రోత్సాహక ఉపకార వేతనాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జగిత్యాల జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్పీ) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆగస్టు 31 వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం నుంచి డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీటెక్, ఎంబీఏ, ఎంబీబీఎస్, ఎంసీఏ, పీజీ, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు అక్టోబర్ 31, 2026 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న బీడీ కార్మికుల పిల్లలు ఈ ఉపకార వేతనాలకు అర్హులని తెలిపారు. అర్హులైన విద్యార్థులు గడువులోపు దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# కేవీపై రాజకీయాలొద్దు: సంజయ్



జగిత్యాల, జూన్ 17 (ఈవార్తలు): కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై ఎంపీ అరవింద్ అనుచరులు చేస్తున్న వ్యాఖ్యలపై జగిత్యాల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కుమార్ స్పందించారు. జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రీయ విద్యాలయానికి 5 ఎకరాల స్థల కేటాయింపునకు సంబంధించి కలెక్టర్ సర్వే నిర్వహించి డిప్యూటీ కమిషనర్ (కేంద్రీయ విద్యాలయం సంఘటన్)కు 10 రోజుల క్రితమే పత్రాలు పంపినట్లు తెలిపారు. అయినప్పటికీ ఈ అంశంపై అనవసర రాజకీయాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా ఏర్పడి 9 సంవత్సరాలు కావడంతో కేంద్రం జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేసిందని, గతంలో కరీంనగర్‌లో కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో విద్యాలయం ఏర్పాటు జరిగిందని గుర్తు చేశారు. చల్గల్‌లో 5 ఎకరాల స్థలం కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసి కేంద్రానికి పంపినట్లు వివరించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో కూడా విద్యా సంస్థల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాత ఎస్పీ కార్యాలయాన్ని తాత్కాలికంగా కేంద్రీయ విద్యాలయానికి కేటాయించి కొన్ని మరమ్మతులు కూడా చేపట్టినట్లు పేర్కొన్నారు. వాలంటరీ క్షేత్రం విషయంలో కేంద్రం, రాష్ట్రం కలిసి సహజ వ్యవసాయం, శాస్త్రవేత్తల శిక్షణ కోసం వినియోగించే అంశాన్ని పరిశీలిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 2025 ఏప్రిల్ 26న రాష్ట్రానికి లేఖ పంపిందని పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయంపై వ్యక్తిగత దూషణలు, వ్యక్తిత్వ హననం చేయడం తగదని, ప్రజలందరూ వాస్తవాలను గమనిస్తున్నారని అన్నారు. ఇకపై ఈ అంశంపై రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్య, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడ్వల జ్యోతి లక్ష్మణ్, సమిళ్ళ శీను, గట్టు సతీష్, కౌన్సిలర్ నవీన్, పీసీసీ సెక్రటరీ బండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంట్లో పెద్ద కొడుకునైత!

**ప్రతి కుటుంబానికి అండగా ఉంటా.. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం**

**గంగాధర మండలంలో పలు పనులకు శంఖుస్థాపన**



గంగాధర, జూన్ 17 (ఈవార్తలు): రాష్ట్రంలోని పల్లెల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందని, చొప్పదండి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలంలోని వివిధ గ్రామాల్లో రూ. 70 లక్షల చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. మంగపేట, నారాయణపూర్,లక్ష్మీదేవిపల్లిగ్రామాలలో రూ.50 లక్షలతో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి, లక్ష్మీదేవిపల్లి లో రూ. 19.98 లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక వికాసానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామాల్లో మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి అనుగుణంగా సంఘ భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందడానికి గ్రామాల్లో ప్రాథమిక ఉప కేంద్ర భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బూరుగుపల్లి గ్రామంలో నిర్వహించిన వన మహోత్సవం లో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి 2000 ఈత మొక్కలను నాటారు.గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అంబటి రజిత,ఎంపిడిఓ రాము, సింగల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు ముద్దం నగేష్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్,సర్పంచ్లు లింగాల లింగయ్య,దికొండ బాబాలక్ష్మి మధు,బాసవేని శ్రీనివాస్, దూలం కళ్యాణ్,రామిడి రాజి రెడ్డి,వేముల భాస్కర్,రేండ్ల శ్రీనివాస్ ,బీర్ల ఆనందం,ప్రభాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య, సాగి అజయ్ రావు, మేర్గ కొండయ్య,పడితపల్లి కిషన్, సంపత్,గుజ్జుల బాపురెడ్డి,అట్ల శేఖర్ రెడ్డి,దూలం వీరేశం,కంకణాల రాజగోపాల్ రెడ్డి,సాయిగౌడ్,ప్రభాకర్ , ప్రేమ్ కుమార్ ,గడ్డం అంజయ్య,అత్తపురం తిరుపతి,బత్తిని సత్యనారాయణ,కరీం,గుండవేని తిరుపతి,కోలేపాక మల్లేశం,కొల ప్రభాకర్,వంగల శ్రీధర్,శంకరయ్య,మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు , గ్రామస్తులు పాల్గొన్నారు.




## ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో జగిత్యాల చిన్నారి

జగిత్యాల, జూన్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాకు చెందిన లంకన్నగారి శ్వేష్ట రెడ్డి (2 సంవత్సరాల 11 నెలల 22 రోజులు) అరుదైన ఘనత సాధించింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది. భారతదేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల రాజధానులను కేవలం ఒక నిమిషంలో గుర్తుచేసి చెప్పిన అత్యంత చిన్న వయసు టాడ్లర్‌గా ఆమె రికార్డు సృష్టించింది. ఈ అసాధారణ ప్రతిభతో "ఫాస్టెస్ట్ టాడ్లర్ టు రీకాల్ క్యాపిటల్స్ ఆఫ్ ఆల్ ఇండియన్ స్టేట్స్ అండ్ యూనియన్ టెరిటరీస్" విభాగంలో స్థానం సంపాదించింది. 2023 జూన్ 17న హైదరాబాద్‌లో జన్మించిన శ్వేష్ట రెడ్డి, జగిత్యాల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ-పద్మలత దంపతుల మనుమరాలు. ఈ ఘనతను 2026 జూన్ 8న సాధించగా, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అదే తేదీన అధికారికంగా ధృవీకరించింది. ఇటీవల ఆమెకు సర్టిఫికెట్, మెడల్ అందజేశారు. తల్లి వేధస్విని, తండ్రి పవన్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే మ్యాప్స్, రాష్ట్రాల పేర్లపై శ్వేష్టకు ఆసక్తి ఉండేదని, ఆటగా ప్రారంభమైన అభ్యాసం క్రమంగా రికార్డు స్థాయికి చేరిందని తెలిపారు. అమ్మమ్మ--తాత ముసిపట్ల లక్ష్మీనారాయణ, పద్మలత మాట్లాడుతూ శ్వేష్ట సాధన కుటుంబానికే కాకుండా తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# దమ్ముంటే కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోవాలి

**ఎమ్మెల్యేకు డాక్టర్ భోగ శ్రావణి సవాల్**



జగిత్యాల, జూన్ 17 (ఈవార్తలు): జగిత్యాల నియోజకవర్గ బీజేపీ కార్యాలయం కమల నిలయంలో బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారిక కార్యక్రమాల్లో కనీస మర్యాదలు పాటించకుండా బీజేపీ ప్రజాప్రతినిధులను విస్మరిస్తున్నారని ఆరోపించారు. సభ మర్యాదల గురించి మాట్లాడే ముందు అధికార పార్టీ నాయకులు తమ వ్యవహార శైలిని పరిశీలించుకోవాలని సూచించారు. గత పాలకులు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాల్లో వ్యవహరించారని, వారిని చూసి నేర్చుకోవాలని అన్నారు. కోరుట్ల, జగిత్యాల పట్టణాల అభివృద్ధిలో స్పష్టమైన తేడా కనిపిస్తోందని పేర్కొన్నారు. జగిత్యాల పట్టణ అభివృద్ధి, యావర్ రోడ్ విస్తరణ, అమృత్-2.0 పనుల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాయికల్‌కు రూ.15 కోట్లు, జగిత్యాలకు రూ.38.60 కోట్లు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, అయినా పురోగతి సాధించామని చెప్పడం విచారకరమని విమర్శించారు. వాలంటరీ స్థలాన్ని కేంద్ర విద్యాలయానికి కేటాయించకుండా అడ్డుకుంటున్నారని, ఆ స్థలంలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. యావర్ రోడ్ విస్తరణకు సంబంధించిన ప్రక్రియ గతంలోనే పూర్తయిందని, ఇప్పుడు కొత్తగా కొలతల పేరుతో రాజకీయ నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలపై భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని, బీజేపీ కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాల కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజల గొంతుకగా బీజేపీ ఎల్లప్పుడూ నిలుస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, జిల్లా కోశాధికారి సుంకేట దశరథరెడ్డి, సిరిపురపు శ్రీనివాస్, గట్టుపల్లి జ్ఞానేశ్వర్, దూరిశెట్టి మమత, ఓడ్నాల రమేష్, గుండేటి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఆరెస్సెస్ కార్యాలయంపై దాడి హేయం

**దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఏసీఎస్ రాజు**

జగిత్యాల, జూన్ 17 (ఈవార్తలు): రాంచీలోని ఆరెస్సెస్ కార్యాలయంపై గుర్తుతెలియని ఇద్దరు దుండగులు పెట్రోల్ బాంబులతో దాడి చేయడాన్ని భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు తీవ్రంగా ఖండించారు. స్థానికంగా నిర్వహించిన సమావేశంలో నాయకుడు చిట్ల గంగాధర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. హిందుత్వ శక్తులు బలపడటం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం శక్తివంతమైన దేశంగా ఎదుగుతుండటాన్ని జీర్ణించుకోలేని కొన్ని మతతత్వ శక్తులు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నాయని అన్నారు. ఆరెస్సెస్ దేశభక్తి కలిగిన సంస్థ అని, దేశం మరియు సమాజానికి ఎలాంటి సమస్యలు ఎదురైనా ముందుండి సేవలు అందించేదని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసే సంస్థ ఎదుగుదలను సహించలేని శక్తులు ఇటువంటి చర్యలకు దిగుతున్నాయని విమర్శించారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, నాయకులు సింగం గంగాధర్, వేముల పోచమల్లు, ఇల్లెందుల పురుషోత్తం, కొత్తకొండ బాలన్న, నరేంద్ర, శ్రీనివాస్, ఎడమల వెంకటరెడ్డి, బొందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల సాగునీటి పనులకు నిధులు మంజూరు చేయాలి

**ఇరిగేషన్ ఈఎన్‌సీ రమేశ్‌బాబుకు ఎమ్మెల్యే సంజయ్ వినతి**



కోరుట్ల/హైదరాబాద్, జూన్ 17 (ఈవార్తలు): కోరుట్ల నియోజకవర్గంలో సాగునీటి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ తెలంగాణ ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ రమేష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. చెరువుల పునరుద్ధరణ, కాలువల మరమ్మతులు, సాగునీటి వసతుల మెరుగుదలకు సంబంధించిన పలు ప్రతిపాదనలను ఆయన సమర్పించారు. మెట్‌పల్లి పట్టణంలో కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇరిగేషన్ శాఖ భూమి నుంచి కేటాయించాలని కోరారు. అలాగే ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కొరుట్ల, మెట్‌పల్లి మండలాల్లో చేపట్టాల్సిన పలు సాగునీటి అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో వేములకుర్తి గంగనాలా ప్రాజెక్టు, ఎర్రాపూర్ ఇదులకుంట చెరువు మరమ్మతులు, మల్లాపూర్ మండలంలో రేగుంట మాటు కాలువ, వల్గొండ-జగదేవిపూర్ వాగు, గొర్రెపల్లి కొత్తకుంట చెరువు పునరుద్ధరణ పనులను ప్రతిపాదించారు. కొరుట్ల మండలంలో కొరుట్ల వాగుపై ఆయకట్టు పునరుద్ధరణ, ఇన్‌స్పెక్షన్ బంగ్లా నిర్వహణ, కాకతీయ ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటరీలు, కల్వర్టు నిర్మాణ పనులకు నిధులు కోరారు. మెట్‌పల్లి మండలంలో రాములచెక్కపేట వద్ద సూపర్ పాసేజ్ వంతెన, ఫుట్‌బ్రిడ్జి నిర్మాణంతో పాటు జగ్గాసాగర్ చెరువు, ఐఎఫ్ఎఫ్‌సీ మరమ్మతుల పనులను ప్రతిపాదించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను త్వరితగతిన ఆమోదించి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ఈఎన్‌సీ రమేష్‌బాబును కోరారు.




## పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

**డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్**

హైదరాబాద్, జూన్ 17 (ఈవార్తలు): పేద ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఓ) డా. పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అంబర్‌పేట్ క్లస్టర్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బాగ్ అంబర్‌పేట్ యూపీహెచ్‌సీ, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ, బోలక్‌పూర్ యూపీహెచ్‌సీ, ఏఎంఎస్ యూపీహెచ్‌సీ, హరాజ్‌పెంట యూపీహెచ్‌సీ, తిలక్‌నగర్ యూపీహెచ్‌సీలకు చెందిన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు అవసరమైన అన్ని రకాల ఆరోగ్య సేవలు అందించడంతో పాటు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇప్పించి వారిని వ్యాధుల నుంచి రక్షించాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి కీటక జనిత వ్యాధుల నివారణ కోసం ఇంటింటి ఆరోగ్య సర్వేలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శ్రీధర్, అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. అనిత, క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా. శ్రీకళ, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఆశ్రిత రెడ్డి, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు పాల్గొని వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు మరియు ఆశా కార్యకర్తలకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందజేశారు.

ఈవార్తలు
వినోదవాణి CINEMA
గురువారం 18-6-2026, జగిత్యాల
www.evarthalu.com



లస్కరి చిత్రం


ప్రగ్యా జైస్వాల్




## విజయ్‌కు టీసీఏ లీగల్ నోటీసులు

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'టీజీ20 లీగ్' చుట్టూ లీగల్ వివాదాలు కమ్మేస్తున్నాయి. తాజాగా ఈ లీగ్‌ను ప్రమోట్ చేస్తున్న టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండతో పాటు పలువురు సినీ, క్రీడా ప్రముఖులకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ లీగల్ నోటీసులు ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది. బీసీసీఐ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండానే హెచ్‌సీఏ టీజీ20 లీగ్‌ను నిర్వహిస్తోందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆరోపిస్తోంది. బీసీసీఐ పర్మిషన్ లేని లీగ్‌ను అక్రమంగా ప్రమోట్ చేయడం చట్టప్రకారం నేరమని టీసీఏ స్పష్టం చేసింది. అదేవిధంగా ఈ లీగ్ పేరుతో హెచ్‌సీఏ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ కంపెనీలతో రూ.వందల కోట్ల వ్యాపారాలు చేస్తోందని మండిపడింది. వినియోగదారులు, యువ క్రికెటర్లను తప్పుదోవ పట్టించేలా ఉన్న ఈ లీగ్‌ను ప్రమోట్ చేయడాన్ని తప్పుబడుతూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ టాలీవుడ్ హీరోలు విజయ్ దేవరకొండ, వెంకటేష్‌లతో పాటు స్టార్ క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, తిలక్ వర్మ, అంబటి రాయుడు లీగల్ నోటీసులు పంపింది. బీసీసీఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న ఈ లీగ్‌పై పునరాలోచన చేయాలని, లేని పక్షంలో చట్టపరంగా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ నోటీసుల్లో టీసీఏ స్పష్టంగా పేర్కొంది.



## లాభాల్లో 'మా ఇంటి బంగారం'

టాలీవుడ్ నటి సమంత రుత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ యాక్షన్ డ్రామా, రిలీజ్‌కు ముందే పెట్టిన పెట్టుబడిని పూర్తిగా రికవరీ చేసుకొని లాభాల బాట పట్టింది. ఈ విషయాన్ని 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై చిత్ర నిర్మాత హిమాంక్ దువ్వూరు అధికారికంగా ప్రకటించారు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సినిమాను రూ. 25 కోట్ల నుంచి రూ. 30 కోట్ల మధ్య బడ్జెట్‌తో నిర్మించారు. అయితే థియేట్రికల్, నాన్-థియేట్రికల్ (ఓటీటీ, శాటిలైట్) హక్కులకు మార్కెట్లో భారీ డిమాండ్ ఏర్పడటంతో, అన్ని డీల్స్ రిలీజ్ వారంలోనే విజయవంతంగా క్లోజ్ అయినట్లు తెలుస్తుంది. ఫలితంగా సినిమా విడుదలకు ముందే సేఫ్ జోన్‌లోకి వచ్చేసింది. ప్రస్తుత మార్కెట్‌లో ఒక మహిళా ప్రధాన తెలుగు చిత్రానికి ఇంతటి క్రేజ్ రావడం బలమైన కమర్షియల్ సిగ్నల్ అని చిత్ర బృందం పేర్కొంది. ఈ సందర్భంగా నిర్మాత హిమాంక్ దువ్వూరు మాట్లాడుతూ సినిమా స్క్రీన్‌పైకి రాకముందే పూర్తి పెట్టుబడిని రికవర్ చేయడం 'మా ఇంటి బంగారం'పై మార్కెట్‌కు ఉన్న నమ్మకానికి నిదర్శనం. సమంత పవర్‌ఫుల్ ప్రెజెన్స్, మా కథపై మేం పెట్టుకున్న నమ్మకం ఈ రోజు కమర్షియల్‌గా రిఫ్లెక్ట్ అవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. దర్శకురాలు నందిని రెడ్డి మాట్లాడుతూ సమంతతో 'జబర్దస్త్', 'ఓ బేబీ' తర్వాత నాకు ఇది మూడో సినిమా. నాపై నమ్మకంతో తనే ఈ ప్రాజెక్ట్‌ను నా దగ్గరకు తీసుకువచ్చింది. జూన్ 19న థియేటర్లలో మీరు సమంతను పది రెట్లు ఎక్కువ పవర్‌ఫుల్‌గా చూస్తారు. ఇది నా ప్రామిస్ అంటూ చెప్పుకొచ్చింది.

## సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నా: అదా శర్మ



'ది కేరళ' స్టోరీ సినిమాతో దేశవ్యాప్తంగా ఫుల్ ఫేమ్ రాబట్టుకుని సంచలనం సృష్టించిన అదా శర్మ.. రూట్ మార్చి వివాదాస్పద చిత్రాలతో తన పాపులారిటీని పెంచుకుంటున్నారు. ఇటీవల 'గవర్నర్' మూవీతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం సూపర్ వెల్లి, ది గేమ్ ఆఫ్ గిర్గిట్, హటక్ వంటి థ్రిల్లర్ సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయారు. అయినప్పటికీ సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరగా ఉంటున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, అదా శర్మ ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో చిట్ చాట్ చేశారు. ఇందులో భాగంగా ఒక నెటిజన్ అదా శర్మను ఉద్దేశించి.. "మీరు మా ఫేవరెట్ నటి. మీ నటన ఎంతో సహజంగా, రియలిస్టిక్‌గా ఉంటుంది. మరి అలాంటప్పుడు మీరు మరాఠీ భాషలో 'కార్ల్ స్టోరీ', '1920', 'కొమ్డో' లాంటి శక్తివంతమైన సినిమాలు ఎందుకు చేయకూడదు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు అదా శర్మ క్రేజీగా సమాధానమిస్తూ.. ఒక పెద్ద హింట్ ఇచ్చారు. జూన్ 18న ఉదయం 10 గంటలకు ఒక బిగ్ సర్‌ప్రైజ్ రాబోతోందంటూ పిల్లి ఎమోజీలతో పాటు నవ్వుతున్న ఎమోజీలను జత చేశారు. దాంతో ఆమె మరాఠీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టబోతోందని, రేపు రాబోయే అప్‌డేట్ అదేనని ఫ్యాన్స్ గట్టిగా ఫిక్స్ అయిపోతున్నారు. మరికొందరు మాత్రం ఆమె నటించే సినిమాలకు సంబంధించిన అప్డేట్ అయి ఉండొచ్చని అంటున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో అదా శర్మ ఇవ్వబోయే ఆ సర్‌ప్రైజ్ ఏంటా అని నెటిజన్లు ఎంతో ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.



## హారర్ విత్ బ్యూటీ..

బాలీవుడ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండేజ్ ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇటీవల 'హౌస్‌ఫుల్ 5' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ప్రస్తుతం భారీ యాక్షన్ కామెడీ మూవీ 'వెల్కమ్ టూ ది జంగిల్' సినిమా షూటింగ్ పనుల్లో బిజీ అయిపోయారు. ఈక్రమంలో.. తాజాగా, జాక్వెలిన్ తన తదుపరి సినిమా కోసం ఓ ప్రయోగం చేయనున్నట్లు పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. తన కెరీర్‌లో ఇంతవరకు చేయని ఒక సరికొత్త జోనర్‌లోకి అడుగుపెట్టబోతున్నట్లు సమాచారం. ఇప్పటివరకు గ్లామర్ పాత్రలు, కమర్షియల్ సినిమాలకే పరిమితమైన ఆమె ఇప్పుడు తన కెరీర్‌లోనే మొదటిసారిగా ఒక అవుట్-అండ్-అవుట్ ప్యూర్ హారర్ చిత్రంలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ఖ్యాతి మదన్ నేతృత్వంలోని నాట్ అవుట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ఈ చిత్రం భారీ స్థాయిలో తెరకెక్కనుందట. పూర్తి స్థాయి భయానక వాతావరణంతో, బలమైన ఎమోషన్స్, మంచి సంగీతంతో సాగనుందని తెలుస్తోంది. జాక్వెలిన్ సరసన ఇద్దరు యంగ్ హీరోలు ముఖ్య పాత్రల్లో నటించనున్నారట. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ఒక టీజర్, సాంగ్ షూట్ కూడా పూర్తయ్యాయని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం నటీనటులు వర్క్‌షాప్స్‌లో బిజీగా ఉండగా, జూన్ నెలాఖరు నుండి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభం కానుందట.




## ఆల్ఫా.. యాక్షన్ ప్యాక్

యష్ రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్ఠాత్మక స్పై యూనివర్స్ నుంచి వస్తున్న మోస్ట్ అవేటెడ్ చిత్రం 'ఆల్ఫా' అధికారిక ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఆలియా భట్, శర్వరీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు శివ్ రావైల్ దర్శకత్వం వహించారు. బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ఆల్ఫా' చిత్రం వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో వస్తున్న మొట్టమొదటి మహిళా ప్రధాన స్పై యాక్షన్ థ్రిల్లర్ కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్‌లో భారతదేశపు తదుపరి తరం సైనికులను తయారు చేసే రహస్య ప్రోగ్రామ్ 'ఆల్ఫా' చుట్టూ కథ తిరుగుతున్నట్లు చూపించారు. "గొర్రెలా కాదు... తోడేలులా జీవించాలి" అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ఇక ట్రైలర్‌లో ఆలియా భట్ మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో కనిపించారు. శర్వరీతో కలిసి భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, గూఢచర్యం, హెవీ కాంబాట్ ట్రైనింగ్ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి.


## భారత్‌కు రానున్న క్రిస్టోఫర్ నోలాన్




హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు క్రిస్టోఫర్ నోలాన్ మరోసారి భారత్‌కు రాబోతున్నాడు. ఆయన దర్శకత్వంలో రాబోతున్న కొత్త మైథిక్ యాక్షన్ ఎపిక్ 'ది ఒడిస్సీ' గ్లోబల్ థియేట్రికల్ రిలీజ్‌ను సెలబ్రేట్ చేసుకునేందుకు ఈ జూలైలో ముంబైకి రాబోతున్నట్లు తెలుస్తుంది. ఇక నోలాన్ వెంట హాలీవుడ్ స్టార్స్ మాట్ డామన్, టామ్ హాలండ్, నిర్మాత ఎమ్మా థామస్ కూడా ఇండియాకు రాబోతున్నట్లు సమాచారం. 'ఇన్‌సెప్షన్', 'ఇంటర్‌స్టెల్లార్', 'టెనెట్', 'ఓపెన్‌హైమర్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న నోలాన్ ఇండియన్ రాబోతుండటంతో అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇక హోమర్ రచించిన గ్రీక్ ఇతిహాసం 'ఒడిస్సీ' ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. మాట్ డామన్ ఒడిస్సియస్ పాత్రలో, టామ్ హాలండ్ టెలిమాకస్ పాత్రలో నటిస్తున్నారు.

## శర్వానంద్‌తో ప్రీతి ముకుందన్ రొమాన్స్

కోలీవుడ్ యంగ్ బ్యూటీ ప్రీతిముకుందన్ శ్రీవిష్ణు సూపర్ హిట్ చిత్రం 'ఓం భీమ్ బుష్' చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీకి పరచయం అయ్యారు. పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'కన్నప్ప'లోనూ కీలక పాత్రలో నటించి మెప్పించారు. రీసెంట్‌గా 'బ్లాస్ట్' చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ కూతురిగా కనిపించి తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం ప్రీతి ముకుందన్ తెలుగు, తమిళ, మలయాళ ఇండస్ట్రీలో వరుస అవకాశాలు అందుకుంటూ ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. తాజాగా, ఈ అమ్మడుకి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు లక్కీగా చార్మింగ్ స్టార్ శర్వానంద్, డైరెక్టర్ శ్రీను వైట్ల కాంబోలో రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రంలో హీరోయిన్‌గా గోల్డెన్ ఛాన్స్ దక్కించుకుందని సమాచారం.







# మెస్సీ హ్యాట్రిక్

## అర్జెంటీనా సూపర్ విక్టరీ

ఫిఫా ప్రపంచ కప్‌ను స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సి ఘనంగా ఆరంభించాడు. తమ తొలి మ్యాచ్‌లోనే హ్యాట్రిక్‌తో మెరిశాడు. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన అర్జెంటీనా 3-0 తేడాతో అల్జీరియాను మట్టికరిపించింది. ఆట ప్రారంభమైన 17వ నిమిషంలోనే మెస్సి మాయ మొదలైంది. తొలి గోల్ కొట్టి అర్జెంటీనాకు ఆధిక్యం అందించాడు. తొలి అర్ధభాగంలో 1-0 ఆధిక్యం సాధించింది. ఇక సెకండాఫ్‌లో మెస్సి మరింత చెలరేగిపోయాడు. 60వ నిమిషంలో, 76వ నిమిషంలో గోల్స్ కొట్టాడు. ప్రపంచ కప్‌లో మెస్సి తొలిసారి హ్యాట్రిక్ నమోదు చేశాడు. దీంతో స్టేడియంలోని ప్రేక్షకులు నిల్చొని చప్పట్లతో అభినందించారు. మ్యాచ్ విజయం అనంతరం లియోనెల్ మెస్సి భావోద్వేగానికి గురయ్యాడు. అయితే, తాను కన్నీళ్లు పెట్టుకోవడానికి కారణం ఫుట్‌బాల్‌కు సంబంధించి కాదని.. వ్యక్తిగతంగా కొన్ని రోజులు ఇబ్బంది పడినట్లు గుర్తు చేసుకున్నాడు. అందుకే, తాను అలా వ్యవహరించినట్లు మ్యాచ్ పోస్ట్ ప్రెజెంటేషన్‌లో వెల్లడించాడు. అయితే, అదేంటని మాత్రం మెస్సి చెప్పలేదు.

### రికార్డులు ఇవీ..

అర్జెంటీనా స్టార్ మెస్సి ప్రపంచకప్‌లో పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు.

ఐదు ప్రపంచ కప్‌ల్లో గోల్స్ చేసిన రెండో ఆటగాడిగా మెస్సి ఘనత సాధించాడు.

క్రిస్టియానో రొనాల్డో కూడా ఐదు ప్రపంచ కప్‌ల్లో గోల్స్ కొట్టాడు. ఇప్పుడు మెస్సి అతడి సరసన చేరాడు.

ప్రపంచ కప్‌ల్లో మెస్సి 16 గోల్స్ చేశాడు. దీంతో జర్మనీకి చెందిన మిరాస్లోవ్ క్లోస్ రికార్డును సమం చేశాడు.

# ట్రైసిరీస్‌లో ఫైనల్‌కు భారత్

## అఫ్గానిస్తాన్‌ను చిత్తు చేసిన తిలక్ సేన

**ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్- 'ఎ' జట్టు తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడేసింది. దంబుల్లా వేదికగా అఫ్గానిస్తాన్- 'ఎ'తో బుధవారం నాటి మ్యాచ్‌లో తిలక్ వర్మ సేన 101 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా నెట్‌రన్‌రేటు భారీగా మెరుగుపరుచుకుని ఫైనల్ చేరుకుంది.**



శ్రీలంక వేదికగా ఆతిథ్య జట్టుతో భారత్- 'ఎ', అఫ్గాన్ - 'ఎ' జట్లు ముక్కోణపు వన్డే సిరీస్ ఆడుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తొలుత శ్రీలంకపై గెలిచిన భారత్.. తదుపరి మ్యాచ్‌లో అఫ్గాన్ చేతిలో ఓడిపోయింది. అనంతరం శ్రీలంకతో మరో మ్యాచ్ ఆడగా.. సూపర్ ఓవర్‌లో తిలక్ వర్మ సేనకు భంగపాటే ఎదురైంది. ఈ క్రమంలో ఫైనల్ రేసులో నిలవాలంటే అఫ్గాన్‌పై బుధవారం నాటి మ్యాచ్‌లో తప్పక గెలవాల్సిన పరిస్థితి. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన భారత్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 319 పరుగులు సాధించింది. ఓపెనర్లలో ప్రియాన్ష్ ఆర్య అర్ధ శతకం (58)తో రాణించగా.. వైభవ్ సూర్యవంశీ (38) ఫర్వాలేదనిపించాడు. వన్‌డౌన్‌లో వచ్చిన రుతురాజ్ గైక్వాడ్ 30 పరుగులు చేయగా.. కెప్టెన్ తిలక్ వర్మ (59), వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుశాగ్ర (58) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. సూర్యాంశ్ షెడ్గే (7) విఫలం కాగా.. నిశాంత్ సింధు (21 నాటౌట్), విప్రాజ్ నిగమ్ (30) మెరుగ్గా రాణించారు. ఫలితంగా భారత్ మంచి స్కోరు సాధించింది. అఫ్గాన్ బౌలర్లలో ఫరీదూన్ దావూద్జాయ్, అబ్దుల్లా అహ్మద్జాయ్, ఫర్మానుల్లా సఫీ రెండేసి వికెట్లు కూల్చగా.. జహీర్ ఖాన్ ఒక వికెట్ దక్కించుకున్నాడు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన అఫ్గానిస్తాన్‌కు ఆరంభంలోనే షాకులు తగిలాయి. టాపార్డర్‌లో ఓపెనర్ హసన్ ఐసాఖిల్ (14), వన్‌డౌన్ బ్యాటర్ ఖలీద్ తనీవాల్ (13) ఇలా వచ్చి అలా వెళ్లారు. మరో ఓపెనర్, కెప్టెన్ ఇమ్రాన్ మిర్ 32 పరుగులతో ఫర్వాలేదనిపించారు. మిగిలిన వారిలో ఫైజల్ షినోజాదా (46), బహీర్ షా (57) ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేయగా.. మిగతా వారంతా చేతులెత్తేశారు. మహ్మద్ ఇషాక్ (16), ఫర్మానుల్లా సఫీ (17లతో పాటు షామ్స్ ఉర్ రహ్మాన్ (8), అబ్దుల్లా అహ్మద్జాయ్ (6), జహీర్ ఖాన్ (4) భారత బౌలర్ల ధాటికి తాళలేక పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఈ క్రమంలో 36.5 ఓవర్లలో 218 పరుగులకే అఫ్గానిస్తాన్ ఆలౌట్ అయింది. ఫలితంగా భారత్ 101 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. భారత బౌలర్లలో నిశాంత్ సింధు నాలుగు వికెట్లతో చెలరేగగా.. యశ్ ఠాకూర్ రెండు, అన్షుల్ కాంబోజ్, విప్రాజ్ నిగమ్, సూర్యాంశ్ షెడ్గే, అనుకుల్ రాయ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. ఇక ఈ విజయంతో భారత్ ఖాతాలో నాలుగు పాయింట్లు చేరాయి. నెట్‌రన్‌రేటు ప్లస్ 0.797. మిగిలిన ఒక్క లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక-అఫ్గానిస్తాన్ అమీతుమీ తేల్చుకుంటాయి. గెలిచిన జట్టు భారత్‌తో ఫైనల్లో తలపడుతుంది.



# అఫ్ఘాన్‌పై గిల్ దండయాత్ర

## కెప్టెన్ శుభ్‌మన్ గిల్ విధ్వంసం.. ఇషాన్ కిషన్ శతక గర్జన

**403 పరుగుల లక్ష్యంతో అఫ్ఘాన్‌కు చుక్కలు.. 170 పరుగుల భారీ విజయంతో సిరీస్ భారత్ వశం**

**కెప్టెన్‌గా గిల్‌కు మరో మైలురాయి.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో సంపూర్ణ ఆధిపత్యం**

**భారత వన్డే జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మరోసారి తన నాయకత్వ ప్రతిభను, బ్యాటింగ్ సామర్థ్యాన్ని చాటిచెప్పాడు. అఫ్ఘానిస్తాన్‌తో జరిగిన రెండో వన్డేలో గిల్ 154 పరుగుల అద్భుత ఇన్నింగ్స్‌తో చెలరేగగా, ఇషాన్ కిషన్ 125 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. వీరిద్దరి శతకాలతో 400 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన భారత్, అనంతరం బౌలింగ్‌లోనూ అఫ్ఘాన్ బ్యాటర్లను కట్టడి చేసి 170 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్: శుభ్‌మన్ గిల్ (154 పరుగులు).**

లక్నో, జూన్ 17 (ఈ వార్తలు): భారత క్రికెట్‌లో కొత్త తరం నాయకత్వానికి ప్రతీకగా ఎదుగుతున్న శుభ్‌మన్ గిల్ మరోసారి అభిమానుల హృదయాలను గెలుచుకున్నాడు. ఇప్పటికే తన బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ యువ ఆటగాడు, ఇప్పుడు కెప్టెన్‌గా కూడా విజయవంతంగా జట్టును నడిపిస్తున్నాడు. అఫ్ఘానిస్తాన్‌తో జరిగిన రెండో వన్డేలో గిల్ ఆడిన ఇన్నింగ్స్ కేవలం పరుగుల వరద మాత్రమే కాదు, నాయకుడిగా జట్టుకు దిశానిర్దేశం చేసిన ఇన్నింగ్స్‌గా కూడా నిలిచిపోయింది.

ఎకానా అంతర్జాతీయ స్టేడియంలో అభిమానులతో కిక్కిరిసిన వాతావరణంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన భారత్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. భారీ స్కోరు చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు తొలి ఓవర్లలోనే ఎదురుదెబ్బ తగిలింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ త్వరగా ఔటవడంతో అఫ్ఘాన్ శిబిరంలో ఆనందం కనిపించింది. అయితే ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మొదట పరిస్థితిని అంచనా వేస్తూ జాగ్రత్తగా ఆడాడు. కొన్ని ఓవర్ల తర్వాత తన సహజ శైలిలో బ్యాటింగ్ ప్రారంభించాడు. కవర్ డ్రైవ్‌లు, స్ట్రెయిట్ డ్రైవ్‌లు, పుల్ షాట్లతో బౌండరీల వర్షం కురిపించాడు. మరోవైపు రోహిత్ శర్మ కూడా తన అనుభవాన్ని ఉపయోగించి స్కోరు వేగాన్ని పెంచాడు. ఇద్దరూ కలిసి రెండో వికెట్‌కు విలువైన భాగస్వామ్యం నెలకొల్పి జట్టును గాడిలో పెట్టారు. రోహిత్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్



కిషన్ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. తొలి బంతి నుంచే దూకుడు ప్రదర్శించిన అతను అఫ్ఘాన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కెప్టెన్ గిల్‌తో కలిసి మూడో వికెట్‌కు 224 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ప్రత్యర్థి ఆశలను పూర్తిగా దెబ్బతీశాడు. ఒకవైపు గిల్ క్లాసిక్ షాట్లతో అలరిస్తే, మరోవైపు ఇషాన్ పవర్ హిట్టింగ్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు. శుభ్‌మన్ గిల్ తన కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటిగా నిలిచేలా 154 పరుగులు సాధించాడు. కేవలం 110 బంతుల్లోనే ఈ స్కోరు నమోదు చేయడం అతని దూకుడుకు నిదర్శనం. ఇన్నింగ్స్ మొత్తం మీద అతను 18 ఫోర్లు, 5 భారీ సిక్సర్లు బాదాడు. ముఖ్యంగా స్పిన్నర్లపై అతను చూపిన ఆధిపత్యం అఫ్ఘాన్ జట్టును పూర్తిగా నిరాశకు గురి చేసింది. ఇషాన్ కిషన్ కూడా తగ్గేదేలే అన్నట్లుగా ఆడాడు. 79 బంతుల్లో 125 పరుగులు సాధించిన అతను మైదానం నలుమూలలా షాట్లు ఆడుతూ అభిమానులకు వినోదాన్ని పంచాడు. అతని ఇన్నింగ్స్‌లో అనేక ఆకర్షణీయమైన సిక్సర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివరి ఓవర్లలో హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్ వేగంగా పరుగులు రాబట్టడంతో భారత్ 400 పరుగుల మార్కును దాటింది. 49.5 ఓవర్లలో 402 పరుగులకు ఆలౌటైనా అప్పటికే మ్యాచ్‌పై పూర్తిస్థాయి పట్టు సాధించింది.

### అఫ్ఘాన్ ఆశలపై భారత బౌలర్ల నీళ్లు

403 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం అంత సులభం కాదని తెలిసినా అఫ్ఘానిస్తాన్ బ్యాటర్లు ధైర్యంగా బరిలోకి దిగారు. అయితే భారత బౌలర్లు తొలి ఓవర్ నుంచే వారిపై ఒత్తిడి పెంచారు. అర్ష్‌దీప్ సింగ్ తన స్వింగ్ బౌలింగ్‌తో ఓపెనర్లను ఇబ్బంది పెట్టగా, ప్రిన్స్ యాదవ్ వేగంతో షాక్ ఇచ్చాడు. తొలి 10 ఓవర్లలోనే అఫ్ఘానిస్తాన్ కీలక వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ భారత్ వైపు పూర్తిగా మొగ్గుచూపింది. కెప్టెన్ హష్మతుల్లా షాహిదీతో పాటు కీలక బ్యాటర్లు పెవిలియన్ చేరడంతో అఫ్ఘాన్ జట్టు కష్టాల్లో పడింది. అయితే రహ్మత్ షా ఒంటరి పోరాటం చేశాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ అర్ధశతకం నమోదు చేశాడు. సేదికుల్లా అతల్ కూడా కొంతసేపు సహకరించాడు. కానీ భారీ లక్ష్యం ఒత్తిడి, భారత బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శన కారణంగా వారు ఎక్కువసేపు నిలవలేకపోయారు.గుర్నూర్ బ్రార్ తన స్పిన్ మాయాజాలంతో మధ్య ఓవర్లలో వరుస వికెట్లు తీసి అఫ్ఘాన్ జట్టుకు కోలుకోలేని దెబ్బ తీశాడు. అర్ష్‌దీప్, ప్రిన్స్ యాదవ్, హార్దిక్ పాండ్యా కూడా తమవంతు పాత్ర పోషించారు. చివరకు అఫ్ఘానిస్తాన్ 44.3 ఓవర్లలో 232 పరుగులకే పరిమితమైంది.

### కెప్టెన్‌గా గిల్ ఎదుగుదల

శుభ్‌మన్ గిల్‌కు ఈ సిరీస్ ప్రత్యేకంగా నిలిచిపోయింది. తొలి మ్యాచ్‌లో అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించిన గిల్, రెండో మ్యాచ్‌లో శతకంతో చెలరేగాడు. కెప్టెన్‌గా ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ, బ్యాటింగ్‌లోనూ అద్భుత ప్రదర్శన చేయడం విశేషం. యువ ఆటగాళ్లతో కూడిన జట్టును సమన్వయం చేస్తూ విజయపథంలో నడిపిస్తున్న గిల్ భవిష్యత్తు భారత క్రికెట్‌కు పెద్ద ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు.

ఈ ఇన్నింగ్స్‌తో వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 3,000 పరుగులు పూర్తి చేసిన భారత ఆటగాడిగా గిల్ కొత్త రికార్డు సృష్టించాడు. విరాట్ కోహ్లీ, శిఖర్ ధావన్ వంటి దిగ్గజాల రికార్డులను అధిగమించడం అతని స్థాయిని మరింత పెంచింది.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# ప్రపంచమే ఒక మైదానం అయ్యే వేళ..!

ఫిఫా వరల్డ్ కప్ అంటే కేవలం ఒక క్రీడా టోర్నమెంట్ కాదు. అది భాషలు, సరిహద్దులు, రాజకీయాలు, సంస్కృతులన్నింటినీ దాటి ప్రపంచాన్ని ఒకే భావోద్వేగంతో కలిపే వేడుక. ప్రతి నాలుగేళ్లకోసారి జరిగే ఈ మహాసంగ్రామం కోట్లాది మంది అభిమానుల హృదయాలను ఒకే తాళంలో కొట్టేలా చేస్తుంది. ఫుట్‌బాల్ అందం దాని సరళతలోనే ఉంది. ఒక బంతి, ఇద్దరు గోల్‌పోస్టులు, 22 మంది ఆటగాళ్లు ఉంటే చాలు.. మైదానంలో అద్భుతాలు పుడతాయి. చివరి నిమిషంలో వచ్చిన ఒక గోల్ దేశం మొత్తం సంబరాల్లో మునిగిపోవడానికి కారణమవుతుంది. అదే సమయంలో ఒక పెనాల్టీ మిస్ అయితే లక్షలాది అభిమానుల కళ్లలో కన్నీళ్లు తెప్పిస్తుంది. ఈ భావోద్వేగాలే ఫుట్‌బాల్‌ను ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడగా నిలబెట్టాయి. ఈ ప్రపంచకప్ మరో విషయాన్ని కూడా గుర్తు చేస్తుంది. విజయం సాధించేది కేవలం స్టార్ ఆటగాళ్ల వల్ల కాదు; జట్టు సమన్వయం, క్రమశిక్షణ, వ్యూహం, పట్టుదల వల్ల. చిన్న దేశాలు కూడా దిగ్గజ జట్లను ఓడించి సంచలనాలు సృష్టించడం ఫుట్‌బాల్ ప్రత్యేకత. అందుకే దీనిని "అనూహ్యతల ఆట" అని పిలుస్తారు. భారత్ ఇప్పటికీ ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ దశకు అర్హత సాధించకపోయినా, దేశంలో ఫుట్‌బాల్ అభిమానుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. పాఠశాలలు, కళాశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ క్రీడకు ఆదరణ పెరుగుతోంది. ఇది భారత యువతకు ఒక అవకాశంగా మారాలి. మౌలిక వసతులు, నాణ్యమైన కోచింగ్, దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకెళ్తే ప్రపంచ ఫుట్‌బాల్ వేదికపై భారత జెండా ఎగరడం అసాధ్యం కాదు. వరల్డ్ కప్ మనకు మరో విలువైన పాఠం చెబుతుంది-ప్రత్యర్థిని గౌరవించడం, నియమాలను పాటించడం, ఓటమిని హుందాగా అంగీకరించడం, విజయాన్ని వినయంతో స్వీకరించడం. క్రీడాస్ఫూర్తి సమాజానికి కూడా అవసరమైన గొప్ప గుణం. అంతిమంగా, ఫిఫా వరల్డ్ కప్ గెలిచే ట్రోఫీ కంటే గొప్పది అది సృష్టించే ఐక్యత. భిన్న జాతులు, భిన్న భాషలు, భిన్న సంస్కృతులు ఒకే ఆట కోసం ఏకమయ్యే అరుదైన సందర్భం ఇది. మైదానంలో గెలుపోటములు సహజం. కానీ ఫుట్‌బాల్ గెలిపించే స్నేహం, క్రమశిక్షణ, జట్టుగా ముందుకు సాగే స్ఫూర్తి మాత్రం చిరస్థాయిగా నిలుస్తాయి.

> తెలంగాణలో వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ పరిస్థితులు ఆశాజనకంగా కనిపించడం లేదు. ఒకవైపు నగరాల్లో కురిసే కొద్దిపాటి వర్షానికే రోడ్లు చెరువుల్లా మారిపోతుంటే, మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో సరిపడా వర్షాలు లేక పొలాలు ఎండిపోతున్నాయి. రుతుపవనాల మందగమనం, వర్షాల అసమాన పంపిణీ, ఎల్ నినో ప్రభావం కలిసి రాష్ట్ర వ్యవసాయం, తాగునీటి భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపే ప్రమాదం కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించి ముందస్తు కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం అత్యవసరంగా మారింది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలకమైనది. లక్షలాది కుటుంబాలు నేరుగా లేదా పరోక్షంగా సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. అలాంటి రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను తేలికగా తీసుకోవడం తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది.



# పల్లె కరువు.. పట్నం చెరువు!

రైతు పంట వేయడానికి సిద్ధమయ్యే సమయానికే వర్షాలు దూరమైతే విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు మొత్తం వృథా కావచ్చు. అప్పుల భారంతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న రైతులు మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఎల్ నినో ప్రభావం సాధారణంగా భారత ఉపఖండంలో వర్షపాతాన్ని తగ్గించే అవకాశం కల్పిస్తుంది. ముఖ్యంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు తగ్గితే వరి, మొక్కజొన్న, పత్తి వంటి పంటలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇప్పటి నుంచే జిల్లా వారీగా ప్రమాద అంచనాలు రూపొందించాలి. ఏ జిల్లాల్లో వర్షాభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందో గుర్తించి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి. అత్యంత ఆందోళన కలిగించే అంశం కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి. భారీ వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు తెలంగాణ సాగునీటి వ్యవస్థకు వెన్నెముకగా నిలవాల్సింది. కానీ పలు భాగాల్లో మరమ్మతులు, నిర్వహణ పనులు పెండింగ్‌లో ఉండడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో నీటి నిర్వహణ సామర్థ్యం తగ్గే అవకాశం ఉంది. వర్షాభావం ఎదురైనప్పుడు అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరును సమర్థంగా వినియోగించాల్సిన సమయంలో ప్రధాన ప్రాజెక్టు పూర్తిస్థాయిలో సిద్ధంగా లేకపోవడం రాష్ట్రానికి నష్టదాయకం. ప్రభుత్వం రాజకీయ విమర్శలు, పరస్పర ఆరోపణలను పక్కనపెట్టి సాంకేతిక నిపుణులతో సమీక్షించి మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. కేవలం పెద్ద ప్రాజెక్టులపైనే ఆధారపడకుండా గ్రామీణ నీటి వనరుల పునరుద్ధరణపై కూడా దృష్టి పెట్టాలి. చెరువులు, కుంటలు, కాలువలు పూడికతో నిండిపోయిన చోట వెంటనే పూడికతీత చేపట్టాలి. వర్షపు ప్రతి చుక్కను నిల్వ చేసే విధంగా స్థానిక జలవనరులను సిద్ధం చేయాలి. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గించేందుకు వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాలను గ్రామస్థాయిలో అమలు చేయాలి. పంటల విషయంలో ప్రభుత్వం రైతులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. వర్షాభావ పరిస్థితుల్లో అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలి. జొన్న, సజ్జ, రాగులు, పప్పుధాన్యాలు, నువ్వులు, పెసర్లు వంటి ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ విస్తృత ప్రచారం నిర్వహించాలి. అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచి రైతులకు సబ్సిడీపై పంపిణీ చేయాలి. వ్యవసాయ విస్తరణ అధికారులు కేవలం కార్యాలయాల్లో కాకుండా నేరుగా గ్రామాలకు వెళ్లి రైతులతో సమావేశాలు నిర్వహించాలి. ప్రతి మండలానికి ప్రత్యేక వ్యవసాయ సలహా బృందాలను ఏర్పాటు చేసి వర్షాల పరిస్థితిని బట్టి పంటల మార్పులు, నీటి వినియోగం, ఎరువుల మోతాదు వంటి అంశాలపై సూచనలు ఇవ్వాలి. డిజిటల్ యాప్‌లు, మొబైల్ సందేశాలు, గ్రామ సభల ద్వారా సమాచారాన్ని వేగంగా చేరవేయాలి. పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయడం కూడా కీలకం. వర్షాభావం వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం నెలల తరబడి ఆలస్యం కాకుండా వేగంగా అందేలా విధానాలు రూపొందించాలి. పంట నష్టాల అంచనాకు డ్రోన్లు, ఉపగ్రహ చిత్రాలు, డిజిటల్ సర్వేలను వినియోగిస్తే పారదర్శకత పెరుగుతుంది. సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకుల ద్వారా తీసుకున్న వ్యవసాయ రుణాలపై వాయిదా సడలింపులు, వడ్డీ ఉపశమన చర్యలు కూడా పరిశీలించాలి. తాగునీటి భద్రత కూడా సమానంగా ముఖ్యమైన అంశం. గ్రామాల్లో బోర్లు ఎండిపోయే అవకాశం ఉన్న ప్రాంతాలను ఇప్పటి నుంచే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అవుతున్న నీటి వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించి అంతరాయం లేకుండా చూడాలి. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడానికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి. పశుసంవర్ధక రంగాన్ని కూడా ప్రభుత్వం విస్మరించరాదు. పచ్చిమేత కొరత ఏర్పడే ప్రాంతాల్లో ఫోడర్ బ్యాంకులు ఏర్పాటు చేయాలి. పశువులకు తాగునీరు, మేత అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. రైతు కుటుంబాలకు ఆదాయంలో పశుసంపద కీలకమైనందున ఈ రంగాన్ని రక్షించడం కూడా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కాపాడటంలో భాగమే. నగరాల్లో మరో విరుద్ధ పరిస్థితి కనిపిస్తోంది. కొద్దిపాటి వర్షానికే హైదరాబాద్‌తో పాటు పలు పట్టణాలు జలమయం అవుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థల లోపాలు, ఆక్రమణలు, చెరువుల నింపివేత, వర్షపు నీటి ప్రవాహ మార్గాల నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు వరద నీరు వృథాగా సముద్రంలో కలుస్తుంటే, మరోవైపు గ్రామాల్లో నీటి కొరత నెలకొనడం ప్రణాళికా వైఫల్యాన్ని సూచిస్తోంది. పట్టణాల్లో వర్షపు నీటిని నిల్వ చేసే నిర్మాణాలు, రీచార్జ్ వ్యవస్థలు, చెరువుల అనుసంధానం వంటి చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ యంత్రాంగం విభాగాల మధ్య సమన్వయం కూడా అత్యంత అవసరం. వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ శాఖలు కలిసి సమగ్ర కరువు నిర్వహణ ప్రణాళిక రూపొందించాలి. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో వారానికోసారి సమీక్షలు నిర్వహించి పరిస్థితులను అంచనా వేయాలి. వాతావరణ సూచనలను ఆధారంగా చేసుకుని ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలి. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఈ సవాలును ఎదుర్కోవడం సాధ్యం కాదు. నీటి వృథాను తగ్గించడం, వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పరిరక్షణ, భూగర్భ జలాల వినియోగంలో మితి పాటించడం వంటి అంశాల్లో ప్రజల్లో అవగాహన పెంచాలి. రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, శాస్త్రవేత్తలు, స్థానిక సంస్థలను భాగస్వాములుగా చేసుకుని కార్యాచరణ అమలు చేస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. సహజ విపత్తులను పూర్తిగా నివారించడం ఎవరి చేతిలోనూ ఉండదు. కానీ వాటి ప్రభావాన్ని తగ్గించడం మాత్రం ప్రభుత్వ సంకల్పం, ప్రణాళిక, సమయానుకూల చర్యలపై ఆధారపడి ఉంటుంది. ఎల్ నినో ముప్పు గురించి ముందుగానే హెచ్చరికలు ఉన్న ఈ సమయంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదు. కాళేశ్వరం వంటి కీలక ప్రాజెక్టులను సత్వరమే సిద్ధం చేయడం, ప్రత్యామ్నాయ సాగు వ్యూహాలు అమలు చేయడం, నీటి సంరక్షణను ఉద్యమంగా మలచడం, రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలు అందించడం ద్వారా మాత్రమే తెలంగాణ కరువు ముప్పును సమర్థంగా ఎదుర్కోగలదు. ఈ వర్షాకాలం కేవలం ఆకాశాన్ని చూసే కాలం కాదు; పాలనా సామర్థ్యాన్ని నిరూపించుకునే సమయం కూడా. ప్రభుత్వం ఇప్పుడే మేల్కొని దూరదృష్టితో చర్యలు తీసుకుంటే రైతు నిలుస్తాడు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిలుస్తుంది, రాష్ట్ర భవిష్యత్తు కూడా సురక్షితంగా ఉంటుంది. ఆలస్యం జరిగితే మాత్రం రాబోయే నెలల్లో కరువు, ఆర్థిక నష్టం, సామాజిక ఇబ్బందులు కలిసి తెలంగాణకు భారీ మూల్యం చెల్లింపజేసే ప్రమాదం ఉంది. ఇప్పుడు తీసుకునే నిర్ణయాలే రేపటి సంక్షోభాన్ని నిర్ధారిస్తాయి.



గంగాధర్ బొమ్మకంటి
ఈవార్తలు దినపత్రిక చైర్మన్

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.